
ఓట్లకు 'ఆసరా' అవుతుందని?

- ప్రతి మండలంలో ఆసరా పేరుతో వైసీపీ సభలు
- సభలలో మహిళలకు చీరలు పంపిణీ
- మహిళల సానుభూతికోసమేనా
- పులివెందుల ప్రజల్లో చర్చ
- ఇప్పటికే చోటామోటా నాయకులకు డబ్బు పంపిణీ

వైసీపీకి ఓటమి భయం పట్టుకున్నట్టుంది. ఇప్పటికే పులివెందులలో పలువురు నాయకులకు, కార్యకర్తలకు డబ్బులు లక్షల్లో పంపిణీ చేశారు. ఇప్పుడు ఆసరా పేరుతో మహిళల ఓట్లకు గాలం వేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి మండలంలోను ఆసరా సభలు నిర్వహిస్తున్నారు. షర్మిల లేదా సునీత పులివెందులలో ఎన్నికల బరిలో దిగితే ఎంపీ స్థానానికి ఇబ్బంది అయ్యే అవకాశం ఉందని, అందుకనే ముందస్తుగా మహిళలను మంచి చేసుకోవడంలో భాగంగా చీరలు పంపిణీ చేస్తున్నారనే చర్చ సాగుతోంది.



సింహాద్రిపురం మండలంలో మహిళలకు పంపిణీ చేసిన చీర



కడప, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం కొలువుదీరి ఐదేళ్లు పూర్తి అవుతోంది. ఈ ఐదేళ్లలో ఎన్నడూ లేని విధంగా ఇప్పుడు వైసీపీ నేతలు మహిళా ఓటర్లను మచ్చిక చేసుకునే కార్యక్రమం చేపట్టారు. నాలుగో విడత ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు ఆసరా పేరుతో నిధులు విడుదల చేసింది. ఈ నిధులను ఆయా డ్వాక్రా సంఘాల వారికి అందించేందుకు మండలానికి ఓ సభ ఏర్పాటుచేసి చెక్కులు పంపిణీ చేస్తున్నారు. అలాగే పనిలో పనిగా ఎన్నికలకు సిద్ధం అయ్యేందుకు మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నారు. వైసీపీ ఎన్నడూ ఈ స్థాయిలో ఓటర్లకు ఎన్నికల కంటే ముందుగా తాయిలాలు అందించిన దాఖలాలు లేవు.

షర్మిల, సునీత ఎన్నికల బరిలో దిగితే..

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో హంతకులను శిక్షించాలంటూ ఆయన కూతురు డాక్టర్ సునీత తీవ్రస్థాయిలో శ్రమిస్తున్నారు. కానీ జగన్ ప్రభుత్వం వివేకా హత్య కేసు నిందితులను కాపాడే ప్రయత్నాలు చేస్తోందనే ఆరోపణలు ఉన్నాయి. మరోపక్క వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె షర్మిల కాంగ్రెస్ పార్టీలో పీసీసీ పదవి తీసుకుని చురుగ్గా ప్రజల్లోకి చొచ్చుకుపోతున్నారు. వీరిద్దరి నుంచి పోటీ ఎదురయ్యే అవకాశాలున్నాయని వైసీపీ అధినాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. తన తండ్రి చావుకు కారకులైన వారిని ఈ ప్రభుత్వం రక్షిస్తోందని, కోర్టును సైతం ప్రభావితం చేస్తోందని తనకు న్యాయం చేయాలంటూ వివేకా కుమార్తె సునీత ప్రజాక్షేత్రంలోకి దిగితే మహిళా ఓటర్లు ఆమెవైపు మళ్లే అవకాశం ఉందని భావిస్తున్నారు. అలాగే షర్మిల కడప పార్లమెంట్ స్థానానికి పోటీపడతారేమోని వైసీపీ వారు అనుమానిస్తున్నారు. అదేనిజమైతే ఏం చేయాలంటూ వైసీపీ అధిష్టానమే తలపట్టుకున్నట్లు తెలుస్తోంది. సునీత, షర్మిల ఒకరు అసెంబ్లీకి, మరొకరు పార్లమెంటుకు బరిలోకి దిగితే తీవ్ర పరిణామాలు సంభవించే అవకాశాలు లేకపోలేదు.

ఎంపీ స్థానానికి కాపాడుకునేందుకు..

ఇప్పటి వరకూ కడప ఎంపీ స్థానాన్ని వైఎస్ కుటుంబ సభ్యులే గెలుచుకుంటూ వస్తున్నారు. అదికూడా పులివెందుల నియోజకవర్గ మెజార్టీ పైనే కడప ఎంపీ స్థానం ఆధారపడి ఉంటుంది. పులివెందుల నుంచి వైసీపీకి ఓట్లు గండిపడితే కడప ఎంపీ సీటు గల్లంతేనని వారు భావిస్తున్నారు. ఇందుకోసమే ఎన్నికల నోటిఫికేషన్ వెలువడక ముందే ఎన్నడూ లేని విధంగా పులివెందుల ప్రాంతంలో వైసీపీ ఓటర్లకు తాయిలాలు ఇస్తున్నారని, ఇలా ఇవ్వడం ఇదే మొదటిసారని ఆ ప్రాంత ప్రజలు అంటున్నారు. ఆ నియోజకవర్గంలోని లింగాల, చక్రాయపేట, సింహాద్రిపురం, తొండూరు తదితర మండలాల్లో ఇప్పటికే చీరల పంపిణీ జరిగింది. ఆసరా సభల పేరుతో మహిళలను పెద్దఎత్తున సభలకు తరలించి వారికి చీరలు అందజేస్తున్నారు. ఒక్కొక్క చీరకు రూ.1000 నుంచి రూ.3000 వరకు ఖర్చు చేసినట్లు తెలిసింది. సింహాద్రిపురం మండలంలో నిర్వహించిన ఆసరా సభలో మహిళలు ఒక్కసారిగా చీరల కోసం ఎగబడ్డారు. దీంతో చీరల పంపిణీ కాసేపు ఆపేసి తర్వాత సాగించారు.

మహిళలకు చీరలు.. మగవారికి డబ్బులు

మహిళలకు చీరలు మాత్రమే కాదు.. పలు గ్రామాల్లో చోటామోటా నాయకులకు కూడా డబ్బుల పంపిణీ సాగుతోంది. కొందరికి మట్టిరోడ్లు వేసేందుకు పనులు అప్పగిస్తున్నారు. పనులు వద్దన్నవారికి నేరుగా లక్షల్లో డబ్బులు ముట్టజెబుతున్నారు. ఆయా కార్యకర్తలు, నాయకులు ఓటర్లను ఎంతమేరకు ప్రభావితం చేయగలరు అనేదానిని బట్టి లక్ష నుంచి పదైదు లక్షల రూపాయల వరకు పంపిణీ చేసినట్లు తెలిసింది. నెల రోజులుగా ఇటు మహిళా ఓటర్లను, అటు పురుష ఓటర్లను ఆకర్షించేలా వైసీపీ తాయిళాలు అందిస్తోంది. నాయకులకు లక్షల్లో ముట్టజెప్పే విషయం బహిరంగంగా సాగకపోయినా.. ఆసరా పేరుతో సాగే సభల్లో మహిళలకు చీరల పంపిణీ మాత్రం బహిరంగంగానే సాగుతోంది. దీనిపై పులివెందులలో పెద్దఎత్తున చర్చ సాగుతోంది.

ప్రధాని మోదీ వర్చువల్‌గా నిర్వహించిన కడప రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల శంకుస్థాపనకు హాజరైన కలెక్టర్ విజయవరామరాజు తదితరులు



రూ.20.35 కోట్లతో కడప రైల్వేస్టేషన్ అభివృద్ధి

- వర్చువల్‌గా శిలాఫలకం ఆవిష్కరించిన ప్రధాని మోదీ

కడప(ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 26: భారత రైల్వే మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అమృత్‌భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ.20.35 కోట్లతో కడప రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 554 అమృత్ రైల్వేస్టేషన్ల అభివృద్ధి పనులకు, దాదాపు 1500 ఆర్వోబీ నిర్మాణపనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజను పరిధిలోని 15 స్టేషన్లతో పాటు 24 రోడ్డు అండర్ బ్రిడ్జిలకు, రూ.20.35 కోట్లతో కడప రైల్వేస్టేషన్ అభివద్ధి పనులు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమానికి కడప నగరం రైల్వే శుభం హాలులో కలెక్టరు విజయరామరాజు, ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ప్రధాని కార్యక్రమం అనంతరం కలెక్టర్ విజయరామరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద రైల్వేస్టేషన్లలో ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలను అందించడమే కాకుండా వాటిని ప్రాధాన్యత గల కేంద్రాలుగా రూపొందించడానికి ప్రణాళికలు రూపొందించిందని తెలిపారు. ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలో దాదాపు రూ.3,141 కోట్ల వ్యయంతో 72 స్టేషన్లను పునరభివృద్ధి చేయనున్నారన్నారు. ఇందులో భాగంగా కడప రైల్వేస్టేషన్‌ను అమృత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేయనున్నారన చెప్పారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం దాదాపు రూ.20.35 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధమైందన్నారు. అలాగే కడప విమానాశ్రయం అభివృద్ధిలో భాగంగా రూ.215 కోట్లతో కొత్త టెర్మినల్ ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశామని, మరో నెల రోజుల్లో అభివృద్ధి పనులకు శిలాఫలకం వేయనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మధుసూధన్, సీనియర్ డివిజనల్ ఇంజనీరు (కోఆర్డినేషన్) యు.అక్కిరెడ్డి, ఏడీఈఎన్ రాధాక్రిష్ణ, ఏడీ ఎస్టీఈ కాత్యాయకుమార్, చీఫ్ టీటీఈ ఉమర్‌బాషా, డీఎంవో డాక్టర్ శ్రీనివాసులు, ఎస్ఎం శేఖర్‌కుమార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి, సింగారెడ్డి శ్రీరామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

- కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 26: స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు త్వరితగతిన నాణ్యమైన పరిష్కారం అందించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో స్పందన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ గణేశ్‌కుమార్, డీఆర్వో గంగాధర్ గౌడ్, డీఆర్డీఏ పీడీ ఆనంద్‌నాయక్ హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదులను అధికారులు క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందేలా త్వరితగతిని పరిష్కారం చూపాలన్నారు.

అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి కావాలి

జిల్లాలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పనులను లక్ష్యం మేరకు గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ విజయరామరాజు మండల స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో కులగణన సర్వే, జీజీఎంపీ పనులు, ఆరోగ్యశ్రీ కార్డులు, జగనన్న ఆరోగ్యసురక్ష, ఈబీసీ నేస్తం, అంగన్వాడీ తనిఖీలు, ఆధార్ సర్వే, జగనన్న పాలవెల్లువ, ఈకేవైసీ, పీఎంఈవై తదితర సంక్షేమ పథకాల అమలు తీరు తెన్నులపై జేసీ గణేశ్ కుమార్, నగర కమిషనర్ ప్రవీణ్‌చంద్, డీఆర్వో గంగాధర్ గౌడ్‌లతో కలసి మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఎలాంటి అలసత్వం లేకుండా ప్రజలకు అందించాలని అధికారులను ఆదేశించారు.

నేటి నుంచి టెట్

- రెండు సెషన్స్‌లో పరీక్షల నిర్వహణ
- పరిశీలకులు ఎంవీ క్రిష్ణారెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 26: టీచర్ ఎలిజిబులిటీ టెస్ట్ (టెట్) పరీక్షలు మంగళవారం నుంచి మార్చి 6వతేదీ వరకు జరుగుతాయని జిల్లా పరిశీలకులు, మోడల్ స్కూలు జేడీ ఎంవీ క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. టెట్ పరీక్షలకు సంబంధించి సోమవారం డీఈవో కార్యాలయంలో డీఈవో అనురాధ అధ్యక్షతన నిర్వహణ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 27 నుంచి మార్చి 6 వరకు రోజుకు రెండు సెషన్స్‌లో పరీక్షలు జరుగుతాయన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం12 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహిస్తామన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులందరూ తప్పనిసరిగా వారి ఒరిజినల్ ఐడీ కార్డులు తెచ్చుకోవాలని సూచించారు. నిర్ణీత సమయం కంటే గంట ముందే పరీక్షకేంద్రాలకు హాజరు కావాలన్నారు. హాల్‌టికెట్‌లో ఏదైనా తప్పు లుంటే సంబంధిత పరీక్ష కేంద్రంలో సరిచూసుకోవాలన్నారు. అంగవైకల్యం కలిగిన అభ్యర్థులకు అదనంగా 50 నిమిషాలు సమయం కేటాయిస్తామన్నారు. అలాగే ఇతర వివరాలకు 7207113047, 9133356786, 9441557508 నెంబర్లకు సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, డిపార్ట్‌మెంటు ఆఫీసర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పరీక్షల పరిశీలకులు ఎంవీ క్రిష్ణారెడ్డి

విజయదుర్గాదేవి, మల్లికార్జునుల కల్యాణోత్సవంలో పాల్గొన్న దుర్గాప్రసాద్ దంపతులు



వైభవంగా విజయదుర్గాదేవి కల్యాణ మహోత్సవం

కడప (కల్చరల్), ఫిబ్రవరి 26: అఖిల భువనాలు పాలించే జగజ్జనని విజయదుర్గాదేవి మల్లికార్జునల కల్యాణ మహోత్సవం సోమవారం విజయదుర్గాదేవి ఆలయంలో కన్నులపండువగా నిర్వహించారు. పురోహితుల వేద మంత్రాలు, పండితుల వ్యాఖ్యానాలు ముత్యాల తలంబ్రాలు, మంగళవాయిద్యాలు అశేష భక్తుల నీరాజనాలతో కల్యాణం నిర్వహించారు. వరాల తల్లి విజయదుర్గాదేవి కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు జిల్లా నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కల్యాణంలో భాగంగా తెల్లవారుజామున అమ్మవారికి 25 కలశాలతో అభిషేకం నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు మల్లికార్జునరావుతో పాటు కుటుంబ సభ్యులు ఉదయం 10గంటలకు యాగశాలలో చండీ హోమం నిర్వహించారు. తదుపరి నవాభరణ శ్రీచక్రార్చనలు, సాయంత్రం 4గంటల నుంచి కల్యాణ మహోత్సవం అద్వితీయంగా నిర్వహించారు. రాత్రి 8గంటలకు విజయదుర్గాదేవి సింహవాహనియై గ్రామోత్సవానికి బయల్దేరి కడప ప్రజలకు కనువిందు చేశారు. ఇందులో ప్రత్యేకించి విచిత్ర వేషధారణలు, శ్యామ్‌కుమార్ బ్యాండ్‌విన్యాసం, మిరుమిట్లు గొలిపే బాణసంచాతో పాటు అశేష జనుల జయజయధ్వనులతో అమ్మవారు ఊరేగారు. ఆలయ వ్యవస్థాపకులు దుర్గా మల్లికార్జునరావు, ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్ వార్షిక బ్రహ్మోత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ యాగమండపంలో మహాపూర్ణాహుతి నిర్వహించారు.

వైసీపీ సభ్యత్వానికి ఎంపీటీసీ, మాజీ జడ్పీటీసీ రాజీనామా

- సీఎం సురేశ్‌నాయుడు సమక్షంలో టీడీపీలో చేరిక

ప్రొద్దుటూరు/రాజుపాళెం, ఫిబ్రవరి 26 : రాజుపాలెం మండలంలోని ఎస్సీ సీనియర్ నాయకుడు మాజీ జడ్పీటీసీ రామనాధుల (వెల్లాల) భాస్కర్, ఆయన భార్య పగిడాల ఎంపీటీసీ సభ్యురాలు రామనాధుల ప్రభావతి సోమవారం వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారు. తమ రాజీనామాను వైసీపీ జిల్లా అధ్యక్షుడు సురేశ్‌బాబుకు అందజేస్తామన్నారు. అనంతరం వీరు ప్రొద్దుటూరులో సీఎం సురేశ్‌నాయుడు ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ 1989 నుంచి కాంగ్రెస్ పార్టీలో ఎస్సీ తరఫున పార్టీకి ఎన్నో సేవలు చేశామన్నారు. తరువాత జగన్ పార్టీ పెట్టిన నాటి నుంచి పార్టీకోసం పనిచేశామన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ప్రొద్దుటూరు నియోజకవర్గంలో 33వేల మంది ఎస్సీలు ఉన్నా సరైన పదవి ఇవ్వకపోవడం తనకు బాధ కలిగించిందన్నారు. రాజుపాలెం మండలంలో ఎస్సీకి ఎంపీపీ పదవి ఇస్తామని చెప్పి కూడా మోసం చేశారన్నారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన ఎస్సీ బీసీలకు వైసీపీలో ఎలాంటి హక్కులు అధికారాలు లేవన్నారు. ప్రొద్దుటూరు మున్సిపాలిటీలో గానీ పంచాయతీల్లో గానీ ఎస్సీ బీసీ ప్రజాప్రతినిధులకు ఎవ్వరికి హక్కులు గానీ అధికారాలు గానీ లేవన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్ రెడ్డి స్వతంత్రులైన ఎస్సీలకు ఎక్కడా గౌరవం ఇవ్వలేదన్నారు. ఎస్సీ బీసీలే కాదు తనకు అనుకూలంగా లేరంటే తన సామాజిక వర్గంలోని వారికి కూడా అధికారాలు లేకుండా తొక్కిపెడతారన్నారు. ఆయన బినామీలు తప్ప మరే వైసీపీ నాయకుడు, కార్యకర్తకు గానీ న్యాయం జరగలేదన్నారు. రాబోవు ఎన్నికలలో ఎమ్మెల్యే రాచమల్లు ఓటమి కోసం టీడీపీ విజయం కోసం పాటు పడతానన్నారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ ఇన్‌చార్జ్ చైర్మన్ ముక్తియార్, కౌన్సిలర్ మునీర్, ఈవీ సుధాకర్‌రెడ్డి, నల్లబోతుల నాగ రాజు తదితరులు పాల్గొన్నారు.



వైసీపీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన ఎంపీటీసీ సభ్యురాలు ప్రభావతి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు భాస్కర్‌తో సీఎం సురేశ్‌నాయుడు

ఫాం-7 తప్పుడు ఫిర్యాదుపై 8మంది వైసీపీ నాయకులపై కేసునమోదు

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 26: ఎర్రగుంట్ల మండలంలోని ఇల్లూరు గ్రామానికి చెందిన టీడీపీ ఓటర్లపై తప్పుడు సమాచారం ఇచ్చిన అదే గ్రామానికి చెందిన 8మంది వైసీపీ నాయకులపై కలమల్ల పోలీసుస్టేషన్‌లో కేసునమోదు చేశారు. వివరాలిలా.. ఇల్లూరు గ్రామంలో నివాసం లేకున్నా టీడీపీ వారికి ఓట్లు ఉన్నాయని వైసీపీకి చెందిన దస్తగిరిరెడ్డి మరో ఏడు గురు కలసి 40మంది టీడీపీ సానుభూతిపరులు, నాయకులపై కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. దీనిపై కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ బృందం విచారణ చేయగా కేవలం ముగ్గురు మాత్రమే లేరని మిగతా వారందరూ గ్రామంలో ఉన్నారని, వీరందరికీ ఒకే పోలింగ్‌బూతులో ఓటు ఉందని తేలింది. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ జమ్మలమడుగు ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి తమవారిపై తప్పుడు సమాచారం ఇచ్చారని ఎన్నికల అధికారులకు ఫిర్యాదుచేశారు. పూర్తిస్థాయిలో విచారణ చేసిన అనంతరం ఇల్లూరులో ఓటర్లకు సంబంధించి ఎన్నికల కమిషన్‌కు తప్పుడు సమాచారం ఇచ్చారని తేలింది. దీంతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు ఫిబ్రవరి 22వ తేదీన ఇల్లూరు గ్రామానికి చెందిన దస్తగిరెడ్డి, క్రిష్టారెడ్డి, శివారెడ్డి, రఘురామిరెడ్డిలపై కేసునమోదు చేయాలని కలమల్ల పోలీసులకు ఆదేశాలిచ్చారు. కోర్టు అనుమతితో వారు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. అయితే మిగతా నలుగురిపై కూడా కేసునమోదు చేయాలని రెవెన్యూ అధికారులు ఆదేశాలివ్వడంతో కోర్టు అనుమతి తీసుకుని సోమవారం కలమల్ల పోలీసులు కేసునమోదు చేసినట్లు సమాచారం.

రైతులను చంపడం రామరాజ్యమా

- ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 26: అన్ని రకాలపంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని ఆందోళన చేస్తుంటే పోలీసుల ద్వారా రైతులను కాల్చి చంపడమే రామరాజ్యమా అని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.ఈశ్వరయ్య ప్రశ్నించారు. సోమవారం కడపలో సీపీఐ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు ఎద్దులబండ్లు, వ్యవసాయ ట్రాక్టర్లు, రైతులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. ప్రభుత్వ విధానాల వల్ల రైతు ఆత్మహత్యలను ప్రతిబింబిస్తూ మెడకు ఉరితాళ్లతో వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల ఆదాయం రెట్టింపు చేస్తా అని ప్రగల్భాలు పలికిన మోదీ ఇప్పటివరకు కనీసం మద్దతు ధర కూడా ఇవ్వలేదన్నారు. దేశంలో వ్యవసాయం ఆదాయకరంగా అప్పుల బాధలతో లక్షల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పొట్ట కొట్టేందుకు బీజేపీ పెద్ద కుట్ర పన్నుతోందన్నారు. చంద్రబాబు, జగన్, పవన్ ముగ్గురు బీజేపీకి కట్టు బానిసల్లాగా ఉన్నారన్నారు. దేశం బాగు పడాలంటే రైతు బాగుండాలంటే బీజేపీని గద్దె దించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, సీపీఎం దస్తగిరిరెడ్డి, బాబు భాయ్, జాకీర్, ఎన్.వెంకటశివ, ఎంవీ సుబ్బారెడ్డి, మనోహర్, ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.



ఉరితాళ్లతో రైతుల వినూత్న నిరసన



ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో కడపలో ర్యాలీ

కొండసుంకేసులలో టీడీపీ వారిపై వైసీపీ రాళ్ల దాడి

- ఇరువర్గాలపై కేసు నమోదు

జమ్మలమడుగు /పెద్దముడియం, ఫిబ్రవరి 26: జమ్మలమడుగు నియోజకవర్గంలోని పెద్దముడియం మండలం కొండసుంకేసులలో సోమవారం ఉదయం స్కూటరులో వెళుతున్న టీడీపీ వర్గీయులపై వైసీపీ వర్గీయులు రాళ్లతో దాడి చేశారు. ఈ దాడిలో గాయపడ్డ బాధితులు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసుల కథనం మేరకు..

కొండసుంకేసులలో ఆదివారం సాయంత్రం టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి బాబు షూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇక్కడ సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో ఓ వైసీపీ నేత డీకేటీ పట్టాలకు సంబంధించి ఒక్కొక్కరి నుంచి రూ.40 వేల నుంచి రూ.46 వేల వరకు వసూలు చేశారని కొందరు గ్రామస్తులు తెలిపారు. దీనిపై సమావేశంలో టీడీపీ నేతలు మాట్లాడుతూ పేద రైతుల నుంచి వైసీపీ వర్గీయులు భూమి పట్టాల పేరుతో డబ్బులు వసూలు చేయడం దారుణం అన్నారు. సమావేశంలో కొందరు దీనిని రికార్డు చేసుకున్నారు.



వైసీపీ వర్గీయుల దాడితో తీవ్రంగా గాయపడ్డంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నటీడీపీ వ్యక్తి

ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం టీడీపీకి చెందిన మేడిగం వెంకటరామిరెడ్డి, వైసీపీకి చెందిన పీఎస్ భాస్కర్‌రెడ్డి సామాజిక మాధ్యమాలలో ఒకరినొకరు తీవ్రంగా విమర్శించుకున్నారు. అనంతరం పొలం వద్ద నుంచి భూమిరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మేడిగం వెంకటరామిరెడ్డి ద్విచక్ర వాహనంలో గ్రామంలోకి వచ్చారు. అప్పటికే సిద్ధంగా ఉన్న వైసీపీ వారు దారికి అడ్డంగా వాహనం పెట్టి రాళ్లదాడి చేశారు. అదే సమయంలో పొలంలో పనులకోసం కూలీలను ఆటోలో ఎక్కించుకునేందుకు అక్కడున్న మేడిగం వెంకటేశ్వరరెడ్డి వారికి సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అక్కడ ఒకరినొకరు తోసుకోవడంతో పాటు పరస్పరం రాళ్లదాడి చేసుకున్నారని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. గాయపడ్డ వారిని ఆసుపత్రికి తరలించామన్నారు. టీడీపీ వర్గీయులు భూమిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మేడిగం వెంకటరామిరెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి, చంద్రమోహన్ రెడ్డి.. వైసీపీకి చెందిన సి.పుల్లారెడ్డి, మల్కిబాయిగారి చిన్న హుస్సేన్‌బాష జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గాయపడినవారిని టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి పరామర్శించారు. అలాగే వైసీపీ వర్గీయులను ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి పరామర్శించారు. ఈ ఘటనకు సంబంధించి పెద్దముడియం ఎస్ఐ రామకృష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. సోమవారం ఉదయం 9.15 గంటల సమయంలో వైసీపీ, టీడీపీ వర్గీయులు సోషియల్ మీడియాలో ఒకరిపై ఒకరు కామెంట్లు చేసుకోవడంతో పాటు నేరుగా ప్రధాన సెంటరులో ఇరువురూ దాడికి దిగారని అన్నారు. ఇరువర్గీయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేశామన్నారు.



కొండసుంకేసుల గ్రామంలో పోలీసుల పికెటింగ్

అర్జీల పరిష్కారంలో శ్రద్ధ చూపాలి

● జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్


అర్జీలు స్వీకరిస్తున్న జేసీ ఫర్మాన్‌అహ్మద్ ఖాన్

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 26: ప్రజల అర్జీలపై ప్రత్యేక శ్రద్ధతో నాణ్యమైన పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాలులో స్పందన కార్యక్రమం నిర్వహించారు. జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌వో సత్యనారాయణ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. నిర్ణీత గడువులోగా అర్జీదారులు సంతృప్తిచెందేలా నాణ్యమైన పరిష్కారం చూపాలని ఆదేశించారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్‌ఏ, రీఓపెనింగ్ లేకుండా సంతృప్తి స్థాయి పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం అర్జీలను స్వీకరించారు. ఈ స్పందన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పారాలీగల్ వలంటీర్లుగా సత్ప్రవర్తన కలిగిన ఖైదీలు


మహిళా ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప(రూరల్) ఫిబ్రవరి 26 : సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను పారాలీగల్ వలంటీర్లుగా నియమిస్తున్నట్లు డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. బాబాఫక్రుద్దీన్ తెలిపారు. సోమవారం నగరంలోని పురుషులు, మహిళల కేంద్ర కారాగారాల్లోని పారాలీగల్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురుషులు, మహిళల కేంద్ర కారాగారాల్లో లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు పనిచేస్తున్నాయన్నారు. వీటిలో పారా లీగల్ వలంటీర్లు ఖైదీల సమస్యలను తెలుసుకుంటూ, వారు ఇచ్చే అర్జీలను లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులకు ఇస్తార న్నారు. వీటిని డీఎల్ఎస్ఏ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి పరిశీలించి తగు చర్యలు తీసుకుంటారన్నారు. అనంతరం కేంద్ర కారాగారంలో ఉన్న బీరువాల తయారీ ఫ్యాక్టరీని, బేకరినీ జడ్జి పరిశీలించారు. కార్యక్రమంలో జైలు అధికారులు, ఖైదీలు పాల్గొన్నారు.

మోదీ ఆధ్వర్యంలో దేశం పురోగతి


రైల్వే అండర్‌బ్రిడ్జి ప్రారంభిస్తున్న దేవగుడి శివనారాయణరెడ్డి

కొండాపురం, ఫిబ్రవరి 26: ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో దేశం అన్ని రంగాలలో పురోగతి సాధిస్తోందని రైల్వే జడ్ఆర్‌యూసీసీ మాజీ మెంబర్ దేవగుడి శివనారాయణరెడ్డి తెలిపారు.అమృత్ భారత్ పథకంలో భాగంగా సోమవారం రూ.41 వేల కోట్లతో దేశ వ్యాప్తంగా ప్రధాని మోదీ 554 రైల్వేస్టేషన్‌ల అభివృద్ధి, 500 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌పాస్ పనులను వర్చువల్‌గా ప్రారంభించారు. అందులో భాగంగా మండలంలోని దత్తాపురం గ్రామం వద్ద నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జిని ఆయన ప్రారంభించారు. విమానాశ్రయాలకు దీటుగా కేంద్రప్రభుత్వం రైల్వేస్టేషన్‌లను అభివృద్ధి చేస్తోందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు నరసింహారెడ్డి, ప్రశాంత్, బీజేపీ నాయకులు శంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి, ఆదినారాయణరెడ్డి మాజీ సర్పంచ్ శ్రీరంగనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుల పేర్లు నమోదు చేసుకోవాలి

● జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఐజే రఘురామయ్య

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 26: త్వరలో జరగబోవు సాధారణ ఎన్నికల్లో బందోబస్తు నిమిత్తం ఆసక్తి గల మాజీ సైనికులు కడపలో జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఐజే రఘురామయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024 సాధారణ ఎన్నికల్లో బందోబస్తు విధుల్లో పాల్గొనదలచిన ఆసక్తి గల మాజీ సైనికుల వివరాలను అందజేయాలని జిల్లా కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్, ఎస్పీ కృష్ణారావు ఆదేశించారన్నారు. ఈ మేరకు ఆసక్తి గల 50 ఏళ్లలోపు వయస్సు ఉన్న మాజీ సైనికులు వెంటనే తమ వివరాలను జిల్లా సైనిక సంక్షేమ అధికారి కడప వారి కార్యాలయంలో నమోదు చేసుకోవాల్సిందిగా ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రాంతీయ వైద్యశాలలో తనిఖీలు


తనిఖీలు చేస్తున్న అధికారులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 26: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సోమవారం సంబంధిత రాష్ట్ర అధికారులు తనిఖీ చేశారు. ఆస్పత్రిలో సమస్యలు, సిబ్బంది పనితీరు, డాక్టర్ల సంఖ్య తదితర అంశాలపై మెడికల్ సూపరింటెండెంట్ రఫీక్‌పాషాను అడిగారు. వార్డులను పరిశీలించారు. కాన్పుల వార్డులో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది పనితీరుపై ఆరా తీసినట్లు సమాచారం. ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తున్నారా, సిబ్బందిలో ఎవరైనా రోగులకు ఇబ్బంది కలిగిస్తున్నారా, ఎవరెవరు ఆస్పత్రిలో ఎంత కాలం నుంచి పనిచేస్తున్నారు అనే అంశాలపై ఆరా తీశారు. అనంతరం కాయకల్ప కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర బృందం డాక్టర్ సునీల్‌కుమార్ నాయక్, డాక్టర్ విజయ్‌కుమార్ తనిఖీలో పాల్గొన్నారు. స్థానిక డాక్టర్లు, నర్సింగ్, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా స్థాయి హాకీ క్రీడాకారుల ఎంపిక


ఎంపికైన జిల్లా జట్టుతో జిల్లా హాకీ సంఘం సెక్రెటరీ శేఖర్ తదితరులు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 26: జిల్లా స్థాయి హాకీ ఉమన్ సబ్ జూనియర్, సీనియర్ హాకీ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించినట్లు జిల్లా హాకీ సెక్రటరీ శేఖర్ తెలిపారు. ఈనెల 25వ తేదీ కడప స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహించిన ఎంపిక పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 40 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఎంపికైన జిల్లా జట్టు మార్చి 8 నుంచి 10వ తేదీ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరీ ఎదయ్ దీప, పీఈటీలు ప్రదీప్, సంతోషి, ఝాన్సీ ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

బీఈడీ, ఎంఈడీ పరీక్షల ప్రారంభం


పరీక్షలను పర్యవేక్షిస్తున్న ప్రొఫెసర్ ఈశ్వరయ్య

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 26 : వైవీయూ పరిధిలో బీఈడీ, ఎంఈడీ సెమిస్టరు పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 13 కళాశాలల్లో నిర్వహిస్తున్న ఈ పరీక్షలను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసరు ఎన్ఈశ్వర్‌రెడ్డి,హైపవర్ కమిటీ సభ్యుడు ప్రొఫెసర్ విజయరాఘవ ప్రసాద్ తనిఖీ చేశారు. వైస్‌చాన్సలర్ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వైపీ వెంకటసుబ్బయ్య మార్గదర్శకంలో పరీక్షలు కట్టుదిట్టంగా నిర్వహిస్తున్నామనిఈశ్వర్‌రెడ్డి తెలిపారు.

సార్వత్రిక ఎన్నికల్లో బాధ్యతగా విధులు నిర్వర్తించాలి


సమావేశానికి హాజరైన జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 26: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పోలీసు సిబ్బంది బాధ్యతతో విధులు నిర్వర్తించాలని డీఎస్పీ సుధాకర్ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు, ఏ ఆర్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పోలీసు సిబ్బంది నిర్వహించాల్సిన విధులు, ఎన్నికలకు సంబంధించిన ప్రత్యేక చట్టాలపై అధికారులకు అవగాహన కల్పించారు. పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ తీసుకోవాల్సిన జాగ్రత్తలు పరిశీలించడంతోపాటు, సంబంధిత అధికారులతో సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కావాల్సిన మౌలిక సదుపాయాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని పోలీసు అధికారులకు సూచించారు.

విలీనానికి ముందున్న ఇన్‌సెంటివ్‌లు .. అలవెన్సులు చెల్లించాలి

● ఆర్టీసీఈయూ రాష్ట్ర అధ్యక్షుడు దామోదర్‌రావు



సదస్సులో మాట్లాడుతున్న పలిశెట్టి దామోదర్‌రావు

కడప (మారుతీనగర్), ఫిబ్రవరి 26 : ఆర్టీసీ గ్యారేజీ సిబ్బందికి విలీనానికి ముందున్న ఇన్సెంటివ్ స్కీం, అలవెన్సులు వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్టీసీ రీజనల్ మేనేజరు కార్యాలయ భవన సముదాయ సమావేశ మందిరంలో కడప జోన్‌లో పనిచేస్తున్న 52 డిపోల గ్యారేజీ సిబ్బంది, కడప నాన్ ఆపరేషన్ సిబ్బందితో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కేకే కుమార్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా దామోదర్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారేజీ సిబ్బందికి సంబంధించిన 51 డిమాండ్లను ఆర్టీసీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకుపోతున్నామన్నారు. గ్యారేజీలోని సిబ్బంది లోటు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విలీనానికి ముందు జీతంతో పాటు చెల్లింపులు చేసి, విలీనం అనంతరం నిలుపుదల చేసిన ఓవర్ టైం డ్యూటీ (ఓటీ), అలవెన్సులను సాధించుకోగలిగామన్నారు. ఈ నెల నుంచి నైట్‌హాల్ట్ డ్యూటీ అలవెన్సులు కూడా జీతంతో పాటే చెల్లించేలా ఆదేశాలు రావడానికి కారణం తమ యూనియన్ కృషేనన్నారు. ఇంకా మిగిలి ఉన్న కండక్టర్లు, డ్రైవర్లు మెయింటెనెన్స్ సిబ్బందికి విలీనానికి ముందు ఉండి, ఇప్పుడు తొలగించిన గ్యారేజీ సిబ్బంది ఇన్సెంటివ్, డ్రైవర్లకు ఆయిల్ పొదుపుపై ఇచ్చే ఇన్సెంటివ్‌లతో పాటు మహిళా కండక్టర్లకు ప్రతి నెలా ఇచ్చే హెల్త్ అలవెన్స్ సాధించుకునేందుకు పోరు కొనసాగిస్తామన్నారు. తదనంతరం ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరు గిడుగు వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ గ్యారేజీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. స్పేర్‌పార్ట్స్ సరిపడా సప్లై చేయడమే కాకుండా మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా టూల్స్‌ను సప్లై చేసేలా చూస్తామన్నారు. ఆధునిక టెక్నాలజీలో సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ కడప రీజనల్ మేనేజరు పి.గోపాల్‌రెడ్డి, డిప్యూటీ సీఎంఈ భాస్కర్, ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్రమణ్యంరాజు, రాష్ట్ర కార్యదర్శి నబీరసూల్, ఉపాధ్యక్షుడు వై.నాగరాజు, రాష్ట్ర నాయకులు మజీద్, ముగరమ్మ, రాధాకృష్ణ, జోనల్ కమిటీ సభ్యులు, 8 జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, 52 డిపోల గ్యారేజీ కమిటీ నాయకులు, నాన్ ఆపరేషన్ యూనిట్ల అధ్యక్ష కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

అల్లర్ల అణచివేతపై పోలీసు సిబ్బందికి శిక్షణ




యాంటీ రయట్ డ్రిల్ చేస్తున్న సిబ్బంది (ఇన్‌సర్ట్) వజ్ర వాహనంపై పోలీసు ఉద్యోగి

కడప (క్రైం), ఫిబ్రవరి 26 : ఎన్నికల సమయంలో అల్లర్లను సమర్థవంతంగా అడ్డుకునేందుకు సివిల్, స్పెషల్‌పార్టీ పోలీసు సిబ్బందికి నాలుగు రోజులుగా శిక్షణ ఇస్తున్నారు. సోమవారం ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్‌వీ కృష్ణారావు ఈ శిక్షణను పరిశీలించి సిబ్బంది స్పందనపై ఆరా తీశారు. ఎస్పీ ఆలోచనా విధానానికి తగ్గట్టుగా తాము మరింత మెరుగ్గా విధులు నిర్వహించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని, ఎలాంటి కఠిన పరిస్థితులనైనా ఎదుర్కోగలమనే ధీమాను పెంపొందించిందని సిబ్బంది సమాధానమిచ్చారు. అల్లరి మూకలను ఉక్కుపాదంతో అణచివేసేందుకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఉపయోగపడతాయన్నారు. సోమవారం టియర్‌గ్యాస్ గన్, వజ్రవాహన వినియోగం, లాఠీ డ్రిల్ తదితర అంశాలపై తర్ఫీదు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శివరాముడు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సివిల్, స్పెషల్ పార్టీ పోలీసులు పాల్గొన్నారు.

అల్లరి మూకల భరతం పడతాం



ప్రశాంత స్వేచ్ఛాయుత ఎన్నికలే లక్ష్యంగా ఎస్పీ సిద్ధార్థ కౌశల్ సిబ్బందిలో వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకు ఇలాంటి శిక్షణ ఇవ్వడం అందులో నేను పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నా. అల్లరి మూకలకు, సంఘ విద్రోహులకు గుణపాఠం చెప్పేందుకు మేమంతా సిద్ధం.

- ఎ.శ్రీనివాసులు, హెచ్‌సీ, బికోడూరు పీఎస్

ఆత్మవిశ్వాసం రెట్టింపు చేసింది



ఎన్నికల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించేందుకు ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంతో ఉపయోగకరంగా ఉంది. మాలో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది. ఎలాంటి కఠిన పరిస్థితులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కోగలమన్న ధీమాను కల్పించింది.

- జి.సురేష్‌బాబు, దువ్వూరు పీఎస్

అన్న క్యాంటీన్‌తో పేదల కడుపు నింపిన సురేష్‌నాయుడు


సన్మానం అందుకుంటున్న సురేష్ నాయుడు

ప్రొద్దుటూరు , ఫిబ్రవరి 26 : అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదల కడుపు నింపిన ఘనత సీఎం సురేష్ నాయుడుదేనని మన ప్రజాసేవాసమితి అధ్యక్షుడు అయూబ్ ఖాన్ కొనియాడారు. సోమవారం స్థానిక పాత బస్టాండ్ వద్ద గల పీఎస్ఆర్ ఫంక్షన్ హాలులో అన్న క్యాంటీన్ ఏర్పాటై 200 రోజులు పూర్తయిన సందర్భంగా సురేష్ నాయుడు కేక్ కట్‌చేశారు. 10 లక్షల మందికి అన్నదాన కార్యక్రమం పూర్తయిన సందర్భంగా మన ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో ఆయనను ఘనంగా సన్మానించి ప్రొద్దుటూరు సేవా రత్న బిరుదును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సురేష్ నాయుడు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వంలో అన్న క్యాంటీన్‌లు ఏర్పాటు చేసి రాష్ట్రంలోని ప్రతి పేదవాడి ఆకలి తీర్చిన ఘనత నారా చంద్రబాబునాయుడుదన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రొద్దుటూరు ప్రజలకు సేవ చేయాలనే లక్ష్యంతో ప్రారంభించిన అన్న క్యాంటీన్‌కు ప్రొద్దుటూరులో విశేష ఆదరణ లభించిందన్నారు. ప్రతిరోజు క్యాంటీన్‌లో మూడు వేల మందికి, మూడు మొబైల్ వాహనాల ద్వారా మరో రెండువేల మందికి భోజనం అందించామన్నారు. ఇప్పటికి 200 రోజులు పూర్తి చేసుకొని పది లక్షలమందికి అన్నదానం చేయగలిగామనే సంతృప్తితో వున్నామన్నారు. మున్సిపల్ మాజీ ఇన్‌చార్జి చైర్మన్ వీఎస్ ముక్తియార్ మాట్లాడుతూ సురేష్ నాయుడు ఏదైనా మంచి పని చేయాలని తలిస్తే.. దానిని ఖచ్చితంగా పూర్తిచేసేదాకా నిద్రపోడన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చుచేసి ప్రజలకు సేవ చేయాలని ముందుకు వస్తున్న నాయకుడు సురేష్‌నాయుడన్నారు. ఆయనకు టిక్కెట్టు వస్తే ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా గెలిపించుకోవాలన్నారు. అనంతరం ముక్తియార్‌కు సిరిపురిరత్న బిరుదును ప్రదానం చేశారు. సురేష్‌నాయుడు తండ్రి మునిస్వామి నాయుడును సన్మానించారు. అన్నా క్యాంటీన్‌కు సేవలందించిన వంటమాస్టర్ శంకర్ న్యాయవాది ఈవీ సుదాకర్‌రెడ్డి, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ ఖలీల్, చెన్నయ్యకు సన్మానం చేశారు. కార్యక్రమంలో 19 వవార్డు కౌన్సిలర్ మునీర్, జనసేన ప్రోగ్రాం కమిటీ సభ్యులు జిలాన్, మన ప్రజా సేవా సమితి గౌరవ అధ్యక్షుడు , ఉపాధ్యక్షుడు బీటెక్ బాషా,సహాయకార్యదర్శి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చీటీల పేరుతో మోసం.. పోలీసులకు ఫిర్యాదు

కడప (క్రైం), ఫిబ్రవరి 26 : చీటీల పేరుతో తమ వద్ద డబ్బు వసూలు చేసి పారిపోయిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ కడపకు చెందిన పలువురు బాధితులు సోమవారం కడప డీఎస్పీ షరీఫ్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. చిన్నచౌకు ప్రాంతానికి చెందిన పలువురు ఆ వ్యక్తి వద్ద లక్షల్లో చీటీలను వేశారు. అందరితో నమ్మకంగా ఉంటూ దాదాపు రూ. 30 కోట్ల వరకు డబ్బులు వసూలు చేసుకుని పరారైనట్లు తెలుస్తోంది. దీంతో బాధితులు పెద్ద సంఖ్యలో కడప డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. అతనిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలంటూ డీఎస్పీకి విజ్ఞప్తిచేశారు.

మిస్టర్ ఆంధ్ర టైటిల్ భాస్కర్‌రావు కైవసం

● రన్నరప్‌గా కిశోర్.. బెస్ట్ పోజర్‌గా మెహరాజ్

● ఘనంగా ముగిసిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీలు


కప్‌లతో విజేతలు

కడప (స్పోర్ట్స్), ఫిబ్రవరి 26 : బాడీబిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (బీబీఏఏపీ) ఆధ్వర్యంలో సోమవారం స్థానిక రవీంద్రనగర్‌లోని యూఎస్ మహల్ (కళ్యాణమండపం)లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాడీ బిల్డింగ్ పోటీల్లో విశాఖకు చెందిన భాస్కర్‌రావు చాంపియన్ ఆఫ్ ది చాంపియన్స్‌గా నిలిచి మిస్టర్ ఆంధ్ర టైటిల్ కైవసం చేసుకున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నూనె నగేశ్, షేక్ యూనుస్ బాషా వెల్లడించారు. రసవత్తరంగా సాగిన ఈ పోటీల్లో ఛాంపియన్ ఆఫ్ చాంపియన్స్ రన్నరప్‌గా విజయనగరానికి చెందిన కిశోర్ నిలిచారన్నారు. బెస్ట్ కోసర్‌గా కడపకు చెందిన మెహరాజ్ నిలబడడం విశేషమన్నారు. ఇదిలా ఉండగా, రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుండి ఈ పోటీలకు సుమారు 300 మంది బాడీ బిల్డర్లు పాల్గొనగా, పెద్ద సంఖ్యలో ప్రేక్షకులు వీక్షించారు. 15 కేటగిరిల్లో జరిగిన పోటీల్లో రాష్ట్ర స్థాయిలోనే మొదటిసారిగా ఏడు బహుమతులు నగదు రూపంలో చెల్లించినట్లు తెలిపారు.

నటుల హంగామా: పోటీల మధ్యలో సినీనటులు రామ్‌జగన్, గీతాసింగ్, జబర్దస్త్ శాంతికుమార్, జంగిల్‌జీవన్, హరికృష్ణ, కార్తీక్‌ప్రసాద్ కామెడీషో, డ్యాన్స్‌లతో హంగామా చేశారు. శాంతికుమార్ మిమిక్రీకి మంచి స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో జనవికాస్ సేవా సమితి నాయకులు తాహిర్, కార్పొరేటర్ షఫి, బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ ఈవై కుమార్, కోశాధికారి రమేష్, మహిళా అధ్యక్షురాలు సీమా పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించండి: ఎస్పీ


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 26: స్పందన కార్యక్రమంలో అందే ఫిర్యాదులపై సత్వరం స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ కృష్ణారావు జిల్లాలోని పోలీసు అధికారులఉ ఆదేశించారు. సోమవారం రాయచోటి పట్టణంలోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ స్పందన (గ్రీవెన్స్ డే) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా నలుమూలల నుండి వచ్చిన 40 మంది ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి ఫిర్యాదు దారులకు సత్వర న్యాయం చేకూర్చాలన్నారు.
సమస్యల పరిష్కారానికి తీసుకున్న చర్యల నివేదికలను ఎప్పటికప్పుడు పోలీసు ప్రధాన కార్యాలయానికి అందించాలని ఆదేశించారు.

అధిక ధరలకు మద్యం అమ్ముతున్నందుకు కేసు


మద్యం షాపును తనిఖీ చేస్తున్న సీఐ అన్నపూర్ణమ్మ

అట్లూరు, ఫిబ్రవరి 26 : ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక. దరలకు మద్యం విక్రయిస్తున్న సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.అన్నపూర్ణమ్మ తెలిపారు. ఏఈఎస్ చిత్తూరు విజిలెన్స్ వారి ఆదేశాల మేరకు సోమవారం ప్రభుత్వ మద్యం షాపులపై తనిఖీలు నిర్వహించామని ఆమె తెలిపారు. ఒక్కరికి మూడు మద్యం సీసాలు మాత్రమే విక్ర యించాలని, ఎక్కువ సంఖ్యలో విక్రయిస్తే సిబ్బందిపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా సారాయి కానీ, కల్తీ మద్యం కానీ, , మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలుతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ సిద్దయ్య భాను, శ్రీనివాస్ స్థానిక వలంటీరు పాల్గొన్నారు.

కడప విద్యార్థినికి పార్లమెంటులో ప్రసంగించే అవకాశం



మాట్లాడుతున్న సానియా (ఫైల్)

కడప (కల్చరల్), ఫిబ్రవరి 26 : భారత పార్లమెంటు భవనంలో ప్రసంగించే అరుదైన సువర్ణ అవకాశాన్ని కడపలోని ఎస్‌కేఆర్ కళాశాలకు చెందిన సయ్యద్ సానియాకు దక్కిందని నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి కె.మణికంఠ తెలిపారు. సోమవారం స్థానిక బాలాజీనగర్‌లోని నెహ్రూ యువకేంద్రం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. భారత ప్రభుత్వం యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆంధ్రప్రదేశ్ వారు వర్చువల్ మోడ్‌లో జాతీయ యూత్ పార్లమెంటు ఫెస్టివల్ 2024 నిర్వహించిన సంగతి తెలిసిందే.. ఈ పోటీల్లో సానియా జాతీయ స్థాయికి చేరుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పార్లమెంటు భవనంలో ప్రసంగించే అవకాశాన్ని దక్కించుకుందన్నారు. చదువుకుంటూ మంచి వక్తగా రాణించడం ఆనందకరమన్నారు. సానియా ఎంపికను జిల్లా యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

ఏసీబీ డీఎస్పీగా గిరిధర్

కడప (క్రైం), ఫిబ్రవరి 26 : కడప జిల్లా అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డీఎస్పీగా వి.గిరిధర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1995 బ్యాచ్‌కు చెందిన ఈయన ప్రస్తుతం తిరుపతి స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తూ బదిలీపై కడపకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవినీతి నిరోధకానికి ప్రజల సహకారం ఉందన్నారు. ప్రభుత్వ శాఖలో పనిచేస్తూ అవినీతికి పాల్పడుతున్న వారి సమాచారం అందించాలని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకున్నందుకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటామని అన్నారు. ఎవరైనా అవినీతిపై సమాచారం ఇవ్వాల్సి ఉంటే 9440446191కు ఫోను చేసి సమాచారం అందించాలని కోరారు.

సాయిబాబా విగ్రహం అపహరణ


సాయిబాబా ఆలయం

ఖాజీపేట, ఫిబ్రవరి 26: కడప-కర్నూలు జాతీయ రహదారిలోని సిద్ధాంతిపురం సమీపంలో ఉన్న సాయిబాబా గుడిలోని అభిషేక విగ్రహం అపహరణకు గురైంది. కమిటీవారి కథనం మేరకు ఏడు నెలల క్రితం ప్రసాద్‌శర్మ అనే వ్యక్తిని గుడిలో పూజారిగా పనిచేసేందుకు నియమించారు. నమ్మకంగా పూజా కార్యక్రమాలు చేస్తుండడంతో వెండిసామాన్లు ఆయనకు అప్పగించారు. అయితే శనివారం రాత్రి నుంచి పూజకు రాకపోవడంతో అనుమానంతో గుడిలో పరిశీలించగా అభిషేక విగ్రహంతో పాటు, ఇతర వస్తువులు కలిపి 10 కేజీల వెండి పోయిందనిపోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని ఆలయ కమిటీ చైర్మన్ కొణతల మోహన్ తెలిపారు.

పురోహితుడి అదృశ్యం


ప్రసాద్‌శర్మ

తన భర్త రెండు రోజులుగా కనిపించడం లేదని, ఖాజీపేటకు చెందిన హేమలత ఫిర్యాదు చేసినట్లు సీఐ రామాంజులు తెలిపారు. పౌరోహిత్యంతో జీవించే ప్ర సాద్ శర్మ మూడేళ్లుగా ఖాజీపేటలో నివాసముంటున్నాడు. పూజకు వెళ్లి వస్తానని శనివారం కడపకు వెళ్లిన అతను ఇప్పటికీ తిరిగిరాకపోవడంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం సాయంత్రం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ వ్యక్తి కనపడితే 9121100623 కు సమాచారం అందించాలని తెలిపారు.

కర్ణాటక బస్సులో రూ. 9,68 లక్షలు సీజ్

కొండాపురం, ఫిబ్రవరి 26 : కేఎస్‌ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి నుంచి కొండాపురం పోలీసులు రూ.9,68,160లు స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని ముచ్చుమర్రి పునరావాస కేంద్రం వద్ద సోమవారం కొండాపురం ఎస్సై యోగీంద్ర ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎస్‌ఆర్టీసీ బస్సులో గుత్తి నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్న ప్రొద్దుటూరు దొరసానిపల్లెకు చెందిన వంశీకృష్ణ అనే వ్యక్తి నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు చూపకపోవడంతో సీజ్ చేసినట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

పెద్దముడ్యం, ఫిబ్రవరి 26: కనుమలోపల్లి సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫర్హానా (35) అనే వివాహిత అక్కడిక్కడే మృతి చెందింది. పోలీసుల వివరాల మేరకు చిన్నముడ్యం సంత గేటు వీధికిచెందిన ఎస్. ముబారక్ భార్య ఫర్హానాతో కలసి ద్విచక్ర వాహనంలో కలిచెర్లకు వెళుతుండగా పెద్దముడ్యం నుంచి దోసకాయల లోడుతో వస్తున్న ఐచర్ వాహనంలో ఢీకొంది. దీంతో ఫర్హానా అక్కడిక్కడే మృతి చెందగా గాయ పడిన ముబారక్‌ను 108 వాహనంలో రాయచోటికి తరలించారు. పెద్దముడ్యం ఎస్ఐ చెన్నకేశవ సంఘటన స్థలం పరిశీలించారు. మృతురాలి బంధువులు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఫర్హానా మృతదేహాన్ని రాయచోటి జిల్లా ప్రభుత్వాసుపత్రికి తర లించారు.

దొరల కాలం నాటి దారిని మూసేస్తారా?

● హైవే, రెవెన్యూ అధికారులపై చెన్నూరు ప్రజల ఆగ్రహం

చెన్నూరు, ఫిబ్రవరి 26 : కడప - కర్నూలుకు చెన్నూరు పాత గ్రామం మీదుగా దొరలకాలం నాటి నుంచి ఉన్న రోడ్డును ఇప్పుడు మూసేస్తే ఊరుకునేది లేదని హైవే అధికారులపై చెన్నూరు ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం చెన్నూరు క్రాసింగ్ వద్ద మళ్లీ కాంక్రీటు గడ్డర్లు అడ్డుపెట్టి దారి మూసివేస్తున్నారంటూ వార్తలు వచ్చిన నేపథ్యంలో మైనార్టీ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెన్నూరు పాత బస్టాడు నుంచి ర్యాలీగా వచ్చి తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. అక్కడ తహసీల్దారు లేకపోవడంతో డిప్యూటీ తహసీల్దారు వెంకటరమణను బయటికి రావాలని కేకలు వేయడంతో రెవెన్యూ సిబ్బంది స్థానిక సీఐ పార్థసారధికి తెలియజేశారు. ఆయన హుటాహుటిన తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. సమస్యను శాంతియుతంగా పరిష్కరించుకోవాలని వారికి తెలిపారు. అయినా మైనార్టీ నేతలు తమ ఆగ్రహాన్ని తగ్గించుకోలేదు. ఈ సందర్భంగా వారు సీఐతో మాట్లాడుతూ బ్రిటీష కాలం నుంచి రాకపోకలంతా చెన్నూరు, కొండపేట మీదుగా జరిగేవని, ఇప్పుడు ఎంతో ఉపయోగంగా ఉన్న ఆ రోడ్డును మూసివేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. తాము బైపాస్ మీదుగా చెన్నూరు కొత్తరోడ్డు పైకి వెళ్లి తిరిగి క్రాసింగ్ వద్దకు రావాలంటే చాలా దూరమవుతుందన్నారు. అండర్ పాస్ చెన్నూరు కొత్తరోడ్డు వద్ద, అలాగే ఇటు క్రాసింగ్ వద్ద పెట్టి ఉంటే ప్రమాదాలు జరిగేవి కాదు కదా అన్నారు. క్రాసింగ్ కన్నా కొత్త రోడ్డు ప్రాంతంలోనే ప్రమాదాలు ఎక్కువగా జరిగాయని, అక్కడ కూడా రోడ్డు మూసేస్తే మేము ఖాజీపేట నుంచి తిరిగిరావాలా అని ప్రశ్నించారు. కార్యక్రమాల్లో మైనార్టీ నేతలు అశ్రఫ్, వారిష్, షఫీ, షబ్బీర్ హుసేన్, మంజూరు అహ్మద్, ఖాజా, అన్వర్, అబ్దుల్‌రబ్ మైనార్టీ నేతలు పాల్గొన్నారు. కాగా వీరికి స్థానిక టీడీపీ, వైసీపీ నేతలు సైతం సంఘీభావం తెలిపారు.



తహసీల్దారు కార్యాలయం వద్ద మైనార్టీ నేతలకు నచ్చచెబుతున్న సీఐ పార్థసారధి

బీజేపీ తొత్తులుగా ఉన్న పార్టీలను ప్రజలు నమ్మరు: తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 26: రాష్ట్రంలో బీజేపీ తొత్తులుగా ఉన్న వైసీపీ, టీడీపీ, జనసేన పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని పీసీసీ మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి అన్నారు. సోమవారం అనంతపురంలో జరిగే ఎన్నికల శంఖారావ మహాసభకు వేంపల్లెనుంచి బయలుదేరారు. తులసిరెడ్డి మాట్లాడుతూ విభజన హామీలు నెరవేర్చేది ఒక్క కాంగ్రెస్ పార్టీనే అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇటు రాష్ట్రంలో, దేశంలో రెండుచోట్ల విజయదుందుభి మోగిస్తుందని తెలిపారు. ఈ ఎలక్షన్లు చెడుకు మంచికి జరుగుతున్న పోరు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో పులివెందుల సమన్వయ కమిటటీ సభ్యుడు ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, చెన్నకేశవ, రాజ, ఉత్తన్న, బద్రి, రవి, పీర్ బాష, రాజ, వినయ్, రాజు, శివ, సుబ్బరాయుడు, మాస్, అమర్ తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం శంఖారావం కార్యక్రమానికి వేంపల్లె నుంచి బయలుదేరిన తులసిరెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు

మద్యనిషేధంపై జగన్ మాట తప్పారు: టీడీపీ

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 26 :మద్యనిషేధం చేసి ఓట్లు అడుగుతానన్న హామీపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పాడని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి సోమవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. మద్యం రేట్లను మూడురెట్లు పెంచారని, 57 నెలల పాలనలో సుమారు 2 లక్షల కోట్ల నాశిరకం మద్యాన్ని అమ్మి వాటి ద్వారా సమకూరిన లక్షల కోట్ల ఆదాయాన్ని తాడేపల్లి ప్యాలెస్‌లో దాచుకున్నారన్నారు. నాసిరకం మద్యం తాగిన వారిలో దాదాపు 35 లక్షల మంది అనారోగ్యంతో ఆసుపత్రిపాలయ్యారన్నారు. అందులో 30వేల మంది ప్రాణాలు కోల్పోవడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. నాసిరకం మద్యం, గంజాయి, డ్రగ్స్ బారిన పడి యువత జీవితం నాశనమైందన్నారు. అత్యాచారాలు, నేరాలు భారీగా పెరిగాయన్నారు. రాబోయే 15 ఏళ్లపాటు మద్యం ఆదాయం తాకట్టు పెట్టి రూ.40వేల కోట్లు అప్పు తెచ్చి తాడేపల్లి ప్యాలెస్‌లో దాచుకున్నాడని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వం రాష్ట్రంలో 4 లక్షల బెల్టుషాపులు, మొబైల్ షాపులు పెట్టించి ప్రజలతో మద్యం వ్యాపారం చేస్తున్నారన్నారు. మద్యం షాపుల్లో నగదు లావాదేవీలు మాత్రమే చేస్తున్నారని, డిజిటల్ పేమెంట్స్ ఎందుకు అనుమతించడంలేదని ప్రశ్నించారు. అవినీతి కోసమే నగదు పేమెంట్స్ చేస్తున్నారన్నారు. ఈ నాసిరక మద్యంలో ఒక్క జగన్ మాత్రమే లక్ష కోట్లు కమిషన్ కొట్టేశారని, వైసీపీ నాయకులు కూడా వేల కోట్లలో సంపాదించుకున్నారన్నారు. మద్యం అక్రమ వ్యాపారం మొత్తం పెద్దిరెడ్డి, విజయసాయిరెడ్డి సిండికేట్ ద్వారానే జరుగుతోందన్నారు. మద్యం మహమ్మారికి వీరే బాధ్యులని తెలిపారు. మద్యం పోవాలంటే, మహిళల మాంగళ్యాలు మంటకలవకూడదంటే జగన్‌పాలన పోయి చంద్రబాబు పాలన రావాల్సిందేనన్నారు. టీడీపీకి ప్రతి ఒక్కరూ ఓటు వేసి గెలిపించాలని కోరారు.

గరుడ వాహనంపై దర్శనమిచ్చిన రంగనాథుడు

పులివెందుల టౌన్, ఫిబ్రవరి 26: పులివెందులలో వెలసిన శ్రీరంగనాథస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం శ్రీదేవి భూదేవి సమేతంగా రంగనాథస్వామి దర్శనం ఇచ్చారు. స్థానిక పూలంగళ్ల వద్ద ఏర్పాటుచేసిన మండపంలో స్వామివారు గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు హాజరై కాయకర్పూరం సమర్పించి మొక్కుకున్నారు. ఆలయ చైర్మన్ సుధీకర్‌రెడ్డి, పాలక మండలి సభ్యులు మాదవాచారి, మల్లికార్జున, రాజశేఖర్, సోమేశ్వరమ్మ, చంద్రావతి, వాణి, సూర్యలక్ష్మి, మహేశ్వరి, ఈఓ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.



గరుడవాహనంపై శ్రీదేవి భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి

బాల్య వివాహాలపై అవగాహన అవసరం

కడప (నాగరాజుపేట), ఫిబ్రవరి 26 : బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారత అధికారి ఆధ్వర్యంలో కడప నగరంలోని గాంధీనగర్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. 18 సంవత్సరాలు కూడా పూర్తిగా నిండకముందే పెళ్లి చేసుకోవడం వల్ల జరిగే దుష్పరిణామాలను వివరించారు. చెడుస్పర్శ, మంచి స్పర్శలపై సోషల్ వర్కర్ వై.విజయకుమారి అవగాహన కలిగించారు. బాల్య వివాహాలు చట్టరీత్యానేరమన్నారు. అవుట్ రీచ్ వర్కర్ కె.యునుష్ బాషా 1098 టోల్‌ఫ్రీ నెంబరు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్ మార్చి 16కు వాయిదా

కడప(రూరల్) ఫిబ్రవరి 26 : జాతీయ, ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాలో మార్చి 9న నిర్వహించాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను మహాశివరాత్రి పర్వదినం, నిరంతర ప్రభుత్వ సెలవుల కారణంగా మార్చి 16న నిర్వహిస్తున్నట్లు డీఎల్ఎస్ఏ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి తెలిపారు. ఈ మార్పును ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు గమనించి మార్చి 16న మూడవ శనివారం నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్ విజయవంతానికి దోహదపడి లోక్ అదాలత్‌లో ఎలాంటి ఖర్చు లేకుండా రాజీ మార్గంలో వారి వారి కేసులను పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్‌లో ఒకసారి కేసు పరిష్కారం అయితే సుప్రీం కోర్టు తీర్పుతో సమానమని, సద్వినియోగం చేసుకోవాలన్నారు.

29న జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలి

వేంపల్లె, ఫిబ్రవరి 26: భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై ఈనెల 29వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం ప్రధానకార్యదర్శి చల్లా బాలాజీ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక అడ్డరోడ్డులోని సర్కిల్ వద్ద మహాధర్నా కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు నుంచి పవర్‌ఫైనాన్స్ పేరుతో కార్పొరేషన్లకు దారి మళ్లించుకున్న నిధులను వెంటనే జమచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, చలపతి, చిన్నోడు, శ్రీనివాసులు, కృష్ణయ్య, రవి, ధోని,రమణ, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో భవన నిర్మాణ కార్మికులకు తీవ్ర అన్యాయం

● 29న కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కడప (సెవెన్‌రోడ్స్), ఫిబ్రవరి 26: ఏపీ భవన నిర్మాణ కార్మికుల (ఏఐటీయూసీ అనుబంధం) సంఘం జాతీయ సమితి పిలుపు మేరకు 29న కలెక్టరు కార్యాయలం వద్ద జరిగే ఆందోళన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, ప్రధాన కార్యదర్శి కె.లింగన్న విజ్ఞప్తి చేశారు. సోమవారం రవీంద్రనగర్ భవన నిర్మాణ కార్మికుల అడ్డాలో ఆందోళనకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు ఈ ఐదేళ్ల కాలంలో తీవ్ర అన్యాయం చేసిందన్నారు. కార్మికులు దాచుకున్న లేబర్ సెస్ 2500 కోట్లు దొడ్డిదారిన తన అవసరాలకు దారి మళ్లించారన్నారు. కార్మికుల కుటుంబాలకు చెల్లించాల్సిన ప్రసూతి సహాయం, వివాహ బహుమతులు, సహజ మరణం, ప్రమాద మరణాల పరిహారాలను చెల్లించకుండా మోసం చేసిందన్నారు. అందుకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కార్మికులందరూ పోరాటానికి సిద్ధపడాలని కోరారు. ఈ నెల 29న కలెక్టరు కార్యాలయం వద్ద జరిగే ఆందోళనకు తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికసంఘం ఎఐటియుసి నాయకులు నరసింహులు, రవి, రాముడు, శ్రీనివాసులు, మున్నా తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న భవన నిర్మాణ కార్మికులు తదితరులు

ప్రతి సమస్యనూ పరిష్కరించాలి: కమిషనర్

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 26 : స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కమిషనర్ ప్రవీణ్‌చంద్ పేర్కొన్నారు. సోమవారం కార్పొరేషన్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపాలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే చెత్త సేకరణ వంద శాతం జరగాలని తెలిపారు. అనుమతి లేని బ్యానర్లను తక్షణం తొలగించాలని సూచించారు. ఎన్నికల సమయం వచ్చినందు వల్ల వాటికి చేయవలసిన ప్రణాళిక ముందుగా సిద్ధం చేసుకోవాల్సిందిగా టౌన్‌ప్లానింగ్ అధికారులకు ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో 64 అర్జీలు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

జేఎన్టీయూ బీటెక్ ఫలితాలు విడుదల

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 26: పులివెందుల జేఎన్టీయూ కళాశాలలో బీటెక్ రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రమణారెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కళాశాలలోని కార్యాలయంలో ఫలితాలు విడుదల చేసిన అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జనవరి/ఫిబ్రవరి-2024లో నిర్వహించిన పరీక్షల ఫలితాలు విడుదల చేశామన్నారు. బీటెక్ మొదటి సంవత్సరం మొదటి సెమిస్టర్ (ఆర్23) రెగ్యులర్, రెండవ, మూడవ సంవత్సరం మొదటి సెమిస్టర్ (ఆర్20) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదల చేశామన్నారు. ఫలతాలను కళాశాల వెబ్‌సైట్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మరియు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సూర్యనారాయణరెడ్డి, పరీక్ష కేంద్ర విభాగాల అధిపతులు, వివిధ డిపార్ట్‌మెంట్‌ల విభాగాధిపతులు తదితరులు పాల్గొన్నారు.



పరీక్షల ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ రమణారెడ్డి

భక్తులకు మెరుగైన సేవలు అందించండి

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 26:మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా పొలతల శ్రీమల్లేశ్వరస్వామి క్షేత్రంలో భక్తులకు మెరుగైన సేవలు అందించాలని కర్నూలు దేవదాయ శాఖ ఉప కమిషర్ పట్టెం గురుప్రసాద్ అన్నారు. సోమవారం పొలతల క్షేత్రాన్ని ఆయన సందర్శించారు. ముందుగా స్వామివారికి పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాలను పరశీలించారు. మహాశివరాత్రికి చేపట్టే ఏర్పాట్లను ఈఓ శ్రీనివాసులు, చైర్మన్ నాగమల్లారెడ్డిలను అడిగి తెలుసుకున్నారు. మంచినీటి వసతి, మజ్జిగ, పార్కింగ్ తదితర అంశాలపై చర్చించారు.




ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న గురుప్రసాద్

హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన

చెన్నూరు, ఫిబ్రవరి 26 : ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ నియంత్రణ మండలి ఆదేశాను సారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో పాత బస్టాండు ఆవరణంలో ఎయిడ్స్‌పై కళాజాత నిర్వహించారు. రాయలసీమ జానపద కళాకారుల సంఘం కళాకారులు ఈ కళాజాతలో హెచ్ఐవీ ఎయిడ్స్ ఎలా వ్యాపిస్తుంది. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపకూడదని, వారిని ప్రేమతో ఆదరించాలని పేర్కొన్నారు. అలాగే 1097 టోల్‌ఫ్రీ నంబరు, సీజనల్ వ్యాధుల గురించి వివరించారు. ఎయిడ్స్ అంటువ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అని, ప్రజలు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి సమస్య రాదని తెలిపారు. అలాగే ఎయిడ్స్ సోకిన వ్యక్తులకు ఇప్పుడు మంచి వైద్యం ఉందని, వారి జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. చాలా ఏళ్ల పాటు వ్యాధి తీవ్రత పెరగకుండా చేయవచ్చన్నారు. జీవిత భాగస్వామితో కలిసి ఉండాలి తప్ప ఇతరులతో కలిసి, కుటుంబాలకు ఇబ్బందులు తీసుకురావద్దన్నారు. కార్యక్రమంలో కేసీ నటరాజ్ బృందం ప్రజలకర్థమయ్యే రీతిలో అప్పటికప్పుడు నాటిక, గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో ఖాసిం, ఏఎన్ఎం కౌన్సెలర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విజయదుర్గాదేవి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా పురవీధులలో ఊరేగుతున్న అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి

టీడీపీని ఆదరించండి

● పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



తెలుగుదేశం పార్టీలో చేరిన వారితో శ్రీనివాసరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 26:టీడీపీని ఆదరించండి.. అభివృద్ధి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం కడప నగరం 28వ డివిజన్‌లో పలువురు టీడీపీలో చేరారు. వారిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ బలోపేతానికి కృషి చేయాలని చెప్పారు. అధికారంలోకి వచ్చాక ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు. అలాగే టీడీపీ విజయానికి శాయశక్తులా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జానీ, రఫి, స్థానికులు పాల్గొన్నారు.

28వ డివిజన్‌లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ

28వ డివిజన్‌లో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనవాసరెడ్డి ఆధ్వర్యం లో బాబు ష్యూరిటీ భవిష్యత్తుగ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించారు. అబుజార్, రాఘవ, ఇమ్రాన్, జిమ్‌బాషా, మహ్మద్, అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనకు రోజులు దగ్గరపడ్డాయి

● కడప టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 26:జగన్ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని టీడీపీ కడప అభ్యర్థి ఆర్.మాధవీరెడ్డి తెలిపారు. సోమవారం కడప నగరం 33వ డివిజన్‌లో చిలకలబావి ప్రాంతంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి టీడీపీ మేనిఫెస్టోకు సంబంధించిన కరపత్రాలను పంచిపెట్టారు. అలాగే టీడీపీ అధికారంలోకి వచ్చాక చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన పెరిగిపోయిందన్నారు. ప్రశ్నించేవారిపై దాడులు, అరెస్టులు బాధాకరమన్నారు. ఇటువంటి పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రజలందరూ టీడీపీకి ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. టీడీపీ నాయకులు అఖిల్, జమాల్, బిట్ల శ్రీధర్, ముస్తాక్, జహీర్, కిరణ్, అజామ్, నర్రూ, ఉస్మాన్, ఆలీం, సాదిక్, ఆశిష్ పాల్గొన్నారు.



33వ డివిజన్‌లో కరపత్రాలు అందిస్తున్న మాధవీరెడ్డి

సహకరించండి.. సమగ్రాభివృద్ధి చేస్తా

● పుత్తా సమక్షంలో 200 మంది యువత టీడీపీలో చేరిక



యువనేత గుగ్గిళ్ల చాణక్య తదితరులను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి

చెన్నూరు, ఫిబ్రవరి 26: వచ్చే ఎన్నికల్లో తమకు సహకరించి టీడీపీకి ఓట్లేసి గెలిపిస్తే సమగ్రాభివృద్ధి చేస్తానని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. సోమవారం సాయంత్రం చెన్నూరు పడమటి వీధిలో యువనేత జి.చాణక్య ఆధ్వర్యంలో యువత టీడీపీలో చేరే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కరెంటు బిల్లుల పెంపు, ఆర్టీసీ చార్జీల మోత, గ్యాస్ ధరలు, డీజలు పెట్రోలు బాదుడుతో రాష్ట్ర ప్రజలు సతమతమవుతున్నారన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ఇవ్వాల్సిన పథకాల్లో కోతపెట్టి ప్రజల నుంచి పన్నుల రూపంలో అధికంగా ముక్కుపిండి వసూలు చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి పాలకులకు ప్రజలే బుద్ధి చెప్పాలని, అందుకోసం యువత నడుం బిగించి ముందుకు కదలాలన్నారు. రాష్ట్ర భవిష్యత్తు అంతా యువత చేతుల్లో ఉందన్నారు. పట్టణాల్లో అన్న క్యాంటీన్లు పెడితే వాటిని మూసివేసి పండుగ కానుకలకు కోతలు వేసి సబ్సిడీ రుణాలు లేకుండా చేసి ఆదరణను అడ్రస్ లేకుండా చేయడం ఈ ప్రభుత్వం ప్రత్యేకత అని ఎద్దేవా చేశారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రతి ఇంటికీ అందిస్తామన్నారు.

టీడీపీలో 200 మంది యువత చేరిక

పడమటి వీధిలో యువనేత గుగ్గిళ్ల చాణక్య ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా 200 మంది యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వారందరికీ పుత్తా కండువా వేసి ఆహ్వానించారు. అంతేకాక పడమటివీధిలో ఉన్న దేవాంగులు ఆది నుంచి టీడీపీకి మంచి పట్టు అని, ఇప్పటికీ ఆ పట్టు సడలలేదన్నారు. చాణక్యతో యువత మరింత చైతన్యమై టీడీపీలోకి రావడం సంతోషకరమన్నారు.టీడీపీ అధికారంలోకి రాగానే వారికి సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. జిల్లా యువనేత పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, మండల కన్వీనరు కె.వి జయభాస్కర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ బీసీ మండల నేతలు ఆటోబాబు, శ్రీకాంత్, భాస్కర్, వెంకటసుబ్బయ్య, గోదిన శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, రైతు నేత మల్లిఖార్జున రెడ్డి, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్, బలిజ సంఘం జిల్లా నేత ఆకుల ప్రసాద్‌బాబు, జనసేన నియోజకవర్గ నేత వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పొట్టిపాటి ప్రతాప్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, ఉపాధ్యక్షుడు కుంచం రామక్రిష్ణారెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రామకోటిరెడ్డి, సాయినరసింహారెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, టీడీపీ సీనియర్ నాయకులు ఉట్టి నారాయణ పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో 25 కుటుంబాలు టీడీపీలో చేరిక

పెండ్లిమర్రి, ఫిబ్రవరి 26: కొండూరు గ్రామంలో వైసీపీ నుంచి మహేంద్రరెడ్డి ఆధ్వర్యంలో 25 కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి పుత్తా నరసింహారెడ్డి కండువా కప్పిపార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, పార్టీ నేతలు సుబ్బరామిరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, నాగసుబ్బయ్య, సత్యమారెడ్డి, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాసులు, రమణారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి చంద్ర ఓబుళరెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, రఘునాథరెడ్డి, సారథిరెడ్డి, అరవేటి చంద్రారెడ్డి, అయ్యవారురెడ్డి, చెంద్రాయుడు, రామసుబ్బారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, అన్నమయ్య, నారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదానం పుణ్యకార్యం

సీకేదిన్నె, ఫిబ్రవరి 26: అన్నదానం పుణ్యకార్యమని సమాజ్ వాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గజ్జెల వెంకటసుబ్బారెడ్డి తెలిపారు.చింతకొమ్మదిన్నె మండలం ఆజాద్‌నగర్‌లోని బృంద వృద్ధాశ్రమంలో సోమవారం సమాజ్‌వాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బరాయుడు కుమార్తె సౌమ్యశ్రీ పుట్టిన రోజు సందర్భంగా వృద్ధులకు అన్నదానం నిర్వహించి పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. సమాజ్‌వాజ్ పార్టీ నాయకులు కొప్పోలి స్వప్న, మీసాల నాగమునెయ్య, ఆదిమూలం రాధా, కొప్పోలి రవి, ఆశ్రమ నిర్వాహకురాలు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా సునీల్‌కుమార్

వేంపల్లె, ఫిబ్రవరి 26: భారతీయ జనతాపార్టీ యువ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా వేంపల్లెకు చెందిన నాగిశెట్టి సునీల్‌కుమార్ నియామకమయ్యారు. ఈమేరకు యువమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి, వేంపల్లె బీజేపీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



శుభాకాంక్షలు తెలియజేస్తున్న శశిభూషణ్‌రెడ్డి

రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరం



ప్రొద్దుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న సురేశ్‌నాయుడు, మాజీ ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి,

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 26 : రాష్ట్రానికి చంద్రబాబు నాయకత్వం అవసరమని టీడీపీ నాయకుడు సీఎం సురేష్‌నాయుడు పేర్కొన్నారు. సోమవారం ఉదయం కొత్తపల్లెపంచాయతీ జేమ్స్ కొట్టాల, సాయంత్రం మున్సిపాలిటీలోని 7 వవార్డులో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా బాబు ఆరుగ్యారెంటీల కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మల్లెల లింగారెడ్డి ,మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మెన్ వీ ఎస్ ముక్తియార్, మాజీ ఎంపీపీ శెట్టి పల్లె ప్రభాకర్‌రెడ్డి, పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షుడు ఈవీ సుధాకర్‌రెడ్డి,కౌన్సిలర్ మునీర్, నల్లబోతుల నాగరాజు, ఖలీల్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో టీడీపీ జెండాను ఎగురేస్తాం : వరద

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 26 : ప్రొద్దుటూరులో వైసీపీ ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డికి రాజకీయ సమాధికట్టి ఇక్కడ టీడీపీ జెండా ఎగురవేస్తామని మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. సోమవారం వైఎంఆర్ కాలనీలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంద్యాల కొండారెడ్డి, మున్సిపల్ చైర్మెన్ ఆసం రఘురామిరెడ్డి, నాగమునిరెడ్డి, ఘంటశాల వెంకటేశ్వర్లు , వంగల నారాయణ రెడ్డి, ధనిరెడ్డి శ్రీనివాసులరెడ్డి, భూమి రెడ్డి శ్రీనివాసులరెడ్డి, పువ్వాడి సురేష్, వంకదార శ్రీను, రిటైర్డ్ డీఈ శివారెడ్డి, పర్లపాడు రమణారెడ్డి, బచ్చలవీరప్రతాప్, గాలి రామకృష్ణ, ద్వారకనాధరెడ్డి, చిన్నం శెట్టిపల్లె భాస్కర్‌రెడ్డి ,ధనిరెడ్డి రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమం అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం: ప్రవీణ్‌రెడ్డి

ప్రొద్దుటూరు ,ఫిబ్రవరి 26 : పేదల సంక్షేమం అభివృద్ధి టీడీపీ తోనే సాధ్యం అవుతుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రవీణ్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పెద్దశెట్టిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని నరసింహాపురంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ బాబుల్ రెడ్డి, మాజీ మార్కెట్ యార్డు చైర్మెన్ బండి భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ మధుసూధన్, రాజుపాలెం మండల కన్వీనర్ విశ్వనాధరెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి తాటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓట్లు దండుకొని పరిహారం ఇచ్చారా : భూపేశ్

కొండాపురం, ఫిబ్రవరి 26: ఆరు నెలల్లో గండికోట నిర్వాసితులకు పరిహారం ఇస్తామని, గత ఎన్నికల ముందు మోసపూరిత వాగ్దానంతో ఓట్లు దండుకున్న ఎంపీ,ఎమ్మెల్యేలు నిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో పూర్తిగా విఫలమయ్యారని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి మండిపడ్డారు. మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో సోమవారం బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, శివనాథరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి,మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి,రెండెద్దుల రామాంజులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బొజ్జ అరుణ, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు మాచుపల్లె లక్ష్మీదేవిలు పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని పూసలవాడ, సుందరయ్యకాలనీలో బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలోకి వస్తే అందించే సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొలవలి వేణుగోపాల్, ఎద్దుల ప్రసాద్, బద్వేలు వెంకటసుబ్బయ్య, వడ్డమాను గురు బ్రహ్మం, పొదలి నరసింహ, రమణ తదితరులు పాల్గొన్నారు.



బద్వేలు పూసలవాడలో ప్రచారం చేస్తున్న అరుణ, లక్ష్మీదేవి



మైలవరంలో ప్రచారం చేస్తున్న సరస్వతి, జ్యోతి

మైలవరం..: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే రానున్న ఎన్నికల్లో టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేయాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి తల్లి సరస్వతి, సతీమణి జ్యోతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని తొర్రివేముల గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాయల్ కిరణ్, నడిపి ఓబులరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రామాంజనేయులు, గురివిరెడ్డి, పాపిరెడ్డి, కొండయ్య, సూర్యపెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి హరికథా సప్తాహం

ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 26 : అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం నుంచి మార్చి 4వ తేదీ వరకు మాఘమాసం సందర్భంగా హరికథా సప్తాహం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి తెలిపారు. సోమవారం ఆలయంలో హరికథా సప్తాహం ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళవారం సాయంత్రం 5 గంటలకు యడవల్లి రమణయ్య భాగవతార్, బుధవారం నాయిని లక్ష్మీకుమారి భాగవతారిణి, గురువారం ముప్పవరపు సింహాచలశాస్త్రి భాగవతార్, మార్చి ఒకటిన శెట్టి గంగావతి భాగవతారిణి, 2న అనసూయ భాగవతారిణి, 3న వేదవతి భాగవతారాణి, 4న జయంతి సావిత్రి భాగవతారాణిల హరికథా కాలక్షేపం ఉంటుందన్నారు. మార్చి 1న శివదీక్ష బృందం, ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో 22వ శివదీపోత్సవం ఘనంగా నిర్వహిస్తామన్నారు. ఉదయం పూజలు, రుద్ర హోమాలు, మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం, సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం ఉంటుందని వివరించారు. సమావేశంలో ఆలయ పాలకమండలి సభ్యుడు మల్లికార్జున శెట్టి, గోవర్ధన్‌రెడ్డి, వెంకటేష్, మహేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్, ఇసుక తరలించే అక్రమార్కులను అధికారులు అరికట్టలేరా..?

జమ్మలమడుగు, ఫిబ్రవరి 26: జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామంలో కొందరు అధికార పార్టీకి చెందిన నేతలు ఖనిజ సంపదను అక్రమంగా దోచుకొని వెళుతున్నా అధికారులు అడ్డుకట్ట వేయలేకపోతున్నారని సీపీఎం జమ్మలమడుగు కార్యదర్శి యేసుదాసు, పట్టణ కార్యదర్శి విజయ్ విమర్శలు చేశారు. సోమవారం జమ్మలమడుగు మండలంలోని గూడెం చెరువు గ్రామ శివార్లలో గూడాదేవి చెరువు, ఒంటిమిద్దె గ్రామాల మధ్య అక్రమంగా మట్టి తరలించి గుంతలు దర్శనమిస్తున్నాయని వారు తెలిపారు. అధికారులు అధికార పార్టీ నేతలపై ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని వారు విమర్శించారు. అనేకసార్లు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోలేదని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్, శ్రీమన్, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలి

కొండాపురం, ఫిబ్రవరి 26: స్వచ్ఛభారత్ కార్మికులకు వెంటనే జీతాలు చెల్లించాలని మండల సీపీఐ కార్యదర్శి మనోహర్‌బాబు డిమాండ్ చేశారు.స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం స్వచ్ఛభారత్ కార్మికులతో కలిసి ఆందోళన చేపట్టారు. 16 నెలలుగా జీతాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కృపాకర్,గంగన్న,పెద్దులయ్య,రంగనాథ్,సురేష్, జ్యోతి, లక్ష్మి,గురమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే అండర్‌పాస్ ప్రారంభోత్సవం



అండర్‌పాస్‌ను ప్రారంభిస్తున్న రైల్వే అధికారులు

ముద్దనూరు ఫిబ్రవరి26: మండల పరిధి కమ్మవారిపల్లె సమీపంలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఏర్పాటు చేసిన రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి ప్రాంభోత్సవం సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోదీచే నిర్వహించారు.అందులో భాగంగా ఎర్రగుంట్ల రైల్వే సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సుల్తాన్ బాష ఆధ్వర్యంలో అండర్‌పాస్ బ్రిడ్జి ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముద్దనూరు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ సునీల్‌కుమార్, డీన్ సీటీటీఐ స్క్వాడ్ రమణ, నంద్యాల ఓఎస్‌మల్లికార్జున,రమణారెడ్డి పాల్గొన్నారు.

దేవస్థానం నూతన కమిటీ ప్రమాణస్వీకారం



ప్రమాణం చేస్తున్న సభ్యులు

చాపాడు, ఫిబ్రవరి 26: చాపాడు మండలంలోని అల్లాడుపల్లె వీరభద్రస్వామి దేవస్థానం నూతన కమిటీ సభ్యులు సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, దేవదాయ శాఖ ప్రొద్దుటూరు ఇన్‌స్పెక్టర్ నరసింహసింగ్ వారితో ప్రమాణస్వీకారం చేయించారు. చైర్మన్‌గా గోసుల వెంకటసుబ్బారెడ్డి, కమిటీ సభ్యులుగా బొగ్గుల పుల్లారెడ్డి, చాపాటి శివశంకర్, ఉమామహేశ్వరి, ఖాదరమ్మ, బుజ్జి, శేషయ్య, కో-ఆప్షన్ సభ్యుడిగా నాగ శివప్రసాద్ ప్రమాణస్వీకారం చేశారు. వీరు రెండేళ్లపాటు కమిటీ సభ్యుడిగా కొనసాగుతారని ఆ దేవస్థానం ఈవో శ్రీనివాసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లక్షుమయ్య, సర్పంచ్ కిశోర్‌కుమార్‌రెడ్డి, మైదుకూరు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డి, వైసీపీ నాయకులు వెంకటరమణారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో సమస్యలపై పలువురు వినతులు



వినతులు సమర్పిస్తున్న దృశ్యం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 26: జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ చాంబర్‌లో సోమవారం వివిధ ప్రాంతాలకు చెందిన బాధిత ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం అధికారులకు వినతి పత్రాలు అందజేశారు. ఉదయాన్నే ట్రైనీకలెక్టర్ మౌర్య భరద్వాజ ఆర్డీవో కార్యాలయం సందర్శించారు. అనంతరం ట్రైనీ కలెక్టర్ భరద్వాజ బాధితులతో మాట్లాడారు. అనంతరం సీపీడబ్ల్యూఎస్ స్కీం నీటి సరఫరా విషయంలో కొండాపురంలో నీటి సమస్యలు ఉన్నట్లు అక్కడ ఓ నేత ట్రైనీ కలెక్టర్‌తో, ఆర్డీవో శ్రీనివాసులుకు తెలియజేశారు. అనంతరం వివిధ సమస్యలపై ట్రైనీ కలెక్టర్ చర్చించారు. అలాగే ఓట్లు తొలగింపు విషయంలో చర్చ జరిగింది..

చర్మకారుల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర లీడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్

బద్వేలు, ఫిబ్రవరి 26: బద్వేలు నియోజకవర్గంలోని చర్మకారుల సమస్యలు పరిష్కరించేందుకు కృషిచేస్తామని రాష్ట్ర లీడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ పేర్కొన్నారు. సోమవారం ఎన్‌జీవో హోంలో చర్మకారులు, ప్రజా సంఘాలు, స్వచ్ఛంధ సంస్థల వారితో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నంపల్లె రెవెన్యూ పొలం 1580 సర్వేనెంబరులో 3.64 సెంట్లు లీడ్ క్యాప్ స్థలాన్ని పరిశీలించడం జరిగిందని, ప్రహరీగోడ నిర్మించేందుకు చర్యలు చేపడతామన్నారు. అంతకుముందు బద్వేలు పట్టణంలోని అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రాం విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో లిడ్ క్యాప్ డైరెక్టర్ రాజేశ్వరి, క్రిష్ణమూర్తి, గొడుగునూరు ప్రతాప్, ఓబయ్య, పిచ్చయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీరాజ్ ఉద్యోగుల సమస్యలపై కృషి చేస్తా'

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 26 : ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగస్తుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తామని ఏపీ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల బద్వేలు డివిజన్ సంఘం జాయింటు సెక్రటరీ బొల్లు సుజనేంద్ర తెలిపారు. ఇటీవల ఆయన జాయింట్ సెక్రటరీగా పదవి రావడంతో సోమవారం ఎంపీడీవో మల్లేశ్వరప్ప తదితరులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సాయి, ప్రసాద్, బాబు, జస్వంత్, సోమిరెడ్డిపల్లె సచివాలయ కన్వీనరు జోగయ్య పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో సంపూర్ణ ఆరోగ్యం

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 26 : ప్రకృతి వ్యవసాయాన్ని చేపట్టి ప్రజలందరూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఏపీసీఎన్ఎఫ్ ప్రకృతి వ్యవసాయం చీఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ తెలిపారు. సోమవారం వెలుగు కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది వీడియో జూమ్ కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. రాబోవు రోజుల్లో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని తెలిపారు. కార్యక్రమంలో బి.మఠం ప్రకృతి వ్యవసాయం సిబ్బంది శ్రీనివాసులు, పీరమ్మ, గురమ్మ, శేఖర్‌రెడ్డి, పుల్లయ్య, శాంతకుమారి, వరాలు, లక్ష్మీదేవి, పావని, సుమలత, గోపాలమ్మ, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30 కుటుంబాలు టీడీపీలో చేరిక



భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన దృశ్యం

కొండాపురం, పిబ్రవరి 26:మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో సుమారు 30 కుటుంబాలు సోమవారం జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీలో చేరారు. చేరిన వారిలో పుల్లయ్య, రామాంజులు,రాజు,నాగరాజు,నరసింహాచారి,పెద్దిరాజు,నరసింహా తదితరులు టీడీపీ కండువా కప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి జంబాపురం రమణారెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గండ్లూరు నాగేశ్వరరెడ్డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: వైసీపీ నుంచి టీడీపీలోకి పది కుటుంబాల వారు చేరారని టీడీపీమండల పార్ట అధ్యక్షులు నగరి భైరవ ప్రసాద్ తెలిపారు. సోమవారం రాత్రి టేకూరుపేట లో దస్తగిరి, మహబూబ్‌బాషా, పెద్ద ఓబయ్య, నడిపి ఓబయ్య, సుబ్రహ్మణ్యం, మద్దినేని నాగమల్లయ్య శక్తిరామయ్య, డి.పాపయ్య, ఆదిబోయిన రామయ్య, ఆదిబోయిన శివ అనే వారు టీడీపీలోకి చేరారన్నారు.

క్రీడాకారుడికి ఆర్థిక సహాయం



ప్రొద్దుటూరు టౌన్, ఫిబ్రవరి 26 : అంతర్జాతీయ షూటింగ్ బాల్ క్రీడాకారుడు దేవేంద్రకు దాతలు ఆర్థిక సహాయం అందించారు. మార్చి 2, 3 తేదీల్లో ఢిల్లీలో అంతర్జాతీయ షూటింగ్ బాల్ వరల్డ్ కప్ పోటీలు జరగనున్నాయి. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న క్రీడాకారుడు దేవేంద్రకు దాతలు మనోహర్‌రెడ్డి, సీమాంధ్ర బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, నేత్ర వైద్యుడు స్వరూప్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు సావిత్రి,జార్జిక్లబ్ నిర్వాహకులు సంయుక్తంగా రూ.30వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఉపవిద్యాశాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి, జార్జిక్లబ్ కార్యదర్శి గంగిరెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు రాజసింహా, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడి చేసి కొట్టారని ఫిర్యాదు

ప్రొద్దుటూరు,ఫిబ్రవరి 26 : స్థల వివాదానికి సంబంధించి తనపై దాడి చేసి డాక్యుమెంటు పత్రాలతో పాటు ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారని మున్సిపల్ మాజీ ఇన్‌చార్జ్ చైర్మన్ ముక్తియార్ ఆయన అనుచరులపై సోమ వారం రాత్రి టూటౌన్ పోలీసు స్టేషన్లో అమీర్ హంజా అనే వ్యక్తి ఫిర్యాదుచేశారు. తనతో పాటు వైసీపీ నేత మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారురెడ్డి, ఆయిల్‌మిల్‌ఖాజా, కౌన్సిలర్లు ఓబులరెడ్డితో కలిసి అమీర్ పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. ఈమేరకు టూటౌన్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి దర్యాప్తు జరుపుతున్నారు. ఇదిలావుండగా పట్టా భూమి అని చెప్పి కాలువ పోరంబోకు భూమిని తన కుమారుడికి అమీర్ హంజా అనే వ్యక్తి అమ్మాడని భగత్ సింగ్ కాలనీకి చెందిన డాక్టర్ గౌస్ తెలిపారు. తర్వాత తాము మోసపోయామని తెలిసి ముక్తియార్ వద్ద పంచాయితీ పెట్టామని, అమీర్ హంజా డబ్బు తిరిగి ఇస్తానని ఒప్పుకున్నాడన్నారు. అయితే ఆయన డబ్బు చెల్లించకపోవడంతో పిలిపించి మాట్లాడినందుకు, వైసీపీ నేతలతో కలిసి ముక్తియార్ పై పోలీసు స్టేషన్లో తప్పుడు ఫిర్యాదు చేశారని డాక్టర్ గౌస్ ఆంధ్రజ్యోతికి వివరణ ఇచ్చారు.

రేపు మండల సర్వసభ్యసమావేశం

కాశినాయన ఫిబ్రవరి26: మండల కేంద్రమైన నర్సాపురం వెలుగు కార్యాలయ సభాభవనంలో బుధవారం ఉదయం 10గంటలకు ఎంపీపీ నల్లేరు పోలమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఈసమావేశానికి జడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఇతర ప్రజా ప్రతినిధులతోపాటు వివిధ శాఖల అధికారులు తమతమశాఖలకు సంబంధించిన సమగ్ర సమాచారంతో తప్పక హాజరుకావాలని ఆయన కోరారు.

నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు



సమావేశంలో మాట్లాడుతున్న శాంతికళ

జమ్మలమడుగు, ఫిబ్రవరి 26: ప్రతి ఒక్కరూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి అయిదు సంవత్సరాలలోపు చిన్నారులకు తప్పకుండా పోలియో చక్కలు వేయించుకుని పిల్లల నిండు జీవితానికి దోహదపడాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో శాంతికళ కోరారు. సోమవారం జమ్మలమడుగు అర్బన్ హెల్త్ సెంటర్‌లో పల్స్‌పోలియో చుక్కలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు ఖాదర్‌బాష, కె.తాహిరా, మెడికల్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

చాపాడు, ఫిబ్రవరి 26: మండలంలోని ఖాదర్‌పల్లె గ్రామం వద్ద నూతనంగా నిర్మించిన దేవాలయంలో వీరాంజనేయస్వామి విగ్రహాన్ని సోమవారం ఘనంగా ప్రతిష్ఠ చేశారు. ప్రొద్దుటూరు, మైదుకూరు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు కూడా దైవదర్శనం చేసుకున్నారు. మైదుకూరు టీడీపీ ఇన్‌చార్జి పుట్టా సుధాకర్ యాదవ్, మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి, టీడీపీ నాయకులు నాయబ్‌రసూల్, ప్రభాకర్ రెడ్డి, రామమోహన్, సుదర్శన్, నారపురెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, వీరనారాయణ, బయపురెడ్డి పాల్గొన్నారు.

పునరావాస కాలనీలో ట్రైనీ స్పెషల్ కలెక్టర్ పర్యటన

కొండాపురం,ఫిబ్రవరి 26 ట్రైనీ స్పెషల్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సోమవారం గండికోట పునరావాస కాలనీలో పర్యటించారు. కొండాపురం, గండ్లూరు,చౌటిపల్లె పునరావాస కాలనీలలో ఉన్న నీటి సమస్యను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పక్కనే గండికోట జలాశయం ఉన్నా నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు.వెంటనే నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి

బద్వేలు, ఫిబ్రవరి 26: బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని భాకరాపేట, నాగుల చెరువు కట్టలు ఆక్రమణకు గురికాకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేసి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీపీఎం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం ఇరిగేషన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ శ్రీనివాసులు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు చిన్ని మాట్లాడుతూ చెరువుల లో సిమెంటు ఫ్యాక్టరీలను ఏర్పాటు చేసి ఆక్రమించుకుంటున్నారన్నారు.పలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

లింగధారిణీదేవి అలంకారంలో పెద్దమ్మతల్లి

మైదుకూరు రూరల్ ఫిబ్రవరి 24 : పట్టణంలోని పాతూరులో ఉన్న పెద్దమ్మతల్లి వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం లింగధారిణీదేవి అలంకారంలో పెద్దమ్మతల్లి దేదీప్యమానంగా వెలిగిపోయారు. తెల్లవారుజామునుంచే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు తండోపతండాలుగా వచ్చి పెద్దమ్మతల్లిని దర్శించుకొన్నారు.రాత్రి సుధీర్ డ్యాన్స్ అకాడమీ వారిచే నృత్య ప్రదర్శన నిర్వహించారు.



తాగునీటి బోరును ప్రారంభించిన పుట్టా



పుట్టా సుధాకర్‌యాదవ్‌కు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

బ్రహ్మంగారిమఠం, ఫిబ్రవరి 26 : బ్రహ్మంగారిమఠం మండలంలోని రేకలకుంట్ల పంచాయతీ బోగాదిపల్లెలో పుట్టా సుధాకర్‌యాదవ్ చేతుల మీదుగా తాగునీటి బోరును ప్రారంభించారు. ఈ తాగునీటి పథకానికి బోగాదిపల్లె గామస్థులైన ఎన్.ఓబయ్యానాయుడు, ప్రతాప్‌నాయుడు సొంత నిధులతో ఎస్టీకాలనీకి మంచినీటిని అందించాలన్న సంకల్పంతో సోమవారం పుట్టా సుధాకర్‌యాదవ్‌ను పిలిపించి ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు.

50 కేజీల కేక్‌ను కట్ చేసిన అభిమానులు..: మైదుకూరు నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా పుట్టా సుధాకర్ యాదవ్‌ను చంద్రబాబు మొదటి లిస్టులోనే పేరు ఖరారు చేయడంతో సోమవారం రేకలకుంట్ల పంచాయతీలోని బోగాదిపల్లె టీడీపీ నేతలు ఎన్.ఓబయ్యానాయుడు, ప్రతాప్ నాయుడు, రామచంద్రనాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర టీడీపీ సీనియర్ నేత రామచంద్రనాయుడు ఆధ్వర్యంలో 50 కేజీల కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పుట్టాసుధాకర్‌యాదవ్‌కు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు రామచంద్రనాయుడు, వెంకటేశ్‌నాయుడు, చాపాడు మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మైదుకూరు మండల అధ్యక్షుడు భీమయ్య, గంగయ్యానాయుడు, భూతప్పనాయుడు, సుబ్బరాయుడుం ప్రతాప్‌నాయడు, ఓబయ్య, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ బద్వేలు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో

O.S. No. 124/23

పొన్నా సురేష్‌కుమార్ తండ్రి సుబ్బయ్య, వ : 25 సం.లు, డి.నెం. 7/42ఎ, శ్రీనివాసపురం గ్రామం, గోపవరం మం, వైఎస్ఆర్ కడపజిల్లా - వాది

V/s

నాగిరెడ్డి శ్రీనివాసులరెడ్డి తండ్రి జగన్నాథరెడ్డి, వ:31 సం.లు, పెద్దకేశంపల్లె గ్రామం, బద్వేలు మం., వైఎస్ఆర్ కడపజిల్లా - ప్రతివాది

పై నెంబరు దావాను వాది షెడ్యూలు దాఖలా ఆస్తిపైన పర్మినెంట్ ఇంజంక్షన్ మరియు I.A.No. 371/23 పిటీషన్‌ను టెంపరవరీ ఇంజంక్షన్ కోరుచూ దాఖలా చేసినాడు. సదరు దావాలో మరియు I.A.No. 371/23 పిటీషన్‌లో 2వ ప్రతివాది /2వ రెస్పాండెంట్ అయిన నీకు ఏమైనా ఆక్షేపణలున్న యెడల 29-2-24 తేదీన ఉ. 10.30 లకు రాజశ్రీ కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకొనవలసినది లేనంతట ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును. షెడ్యూలు : కడప డి., ప్రొద్దుటూరు రి.డి., బద్వేలు సబ్.డి., బద్వేలు మండలం చింతలచెరువు పంచాయితీ, ఇమదాపురం గ్రామ పొలం లోని సర్వేనెం. 56/2 యు. 5.00లు పూరా, చెక్కుబంది: ఉత్తరం - భూమిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి వగైరాల భూమి, తూర్పు - పొన్నా నాగేంద్ర భూమి, సర్వేనెం. 56/2, పడమర - పొన్నా నాగేంద్రబాబు భూమి, సర్వేనెం. 56/1, దక్షిణం- నాగిరెడ్డి రామసుబ్బారెడ్డి భూమి మరియు రోడ్డు.

దేవిరెడ్డి బ్రహ్మరెడ్డి, అడ్వకేట్, బద్వేలు

పిచ్చిమొక్కల మధ్య ప్రభుత్వ కార్యాలయాలు

భయాందోళనలో సిబ్బంది



పెరిగిన పిచ్చిమొక్కలు

చాపాడు, ఫిబ్రవరి 26: మండల కేంద్రమైన చాపాడులోని పలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ గడ్డి, పిచ్చిమొక్కలు పెరిగి ఉన్నాయి. కొన్నేళ్ల నుంచి ఈ పిచ్చిమొక్కలు పెరిగాయి. వీటిని తొలగించేందుకు ఏ ఒక్క అధికారి కూడా చర్యలు తీసుకోలేదు. అందువలన విష పురుగులు నివాసం ఏర్పాటు చేసుకున్నాయి. అప్పుడప్పుడు విషపురుగులు కార్యాలయం ముందుభాగం వచ్చి దర్శనమిస్తున్నాయని సిబ్బంది తెలిపారు. వీటిని చూసి సిబ్బంది భయానికి గురవుతున్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం, భవిత వికలాంగుల సెంటర్, ఉపాధి కార్యాలయం వెలుగు కార్యాలయం, లైబ్రరి కార్యాలయం అన్నీ ఒకే ఆవరణలో ఉన్నాయి. వీటి వెనుక భాగాన, పక్క సందుల్లో పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా ఉన్నాయి. ప్రతిరోజు ఈ కార్యాలయాలకు సిబ్బంది, ప్రజలు, డ్వాక్రా మహిళలు వారి అవసరాల కోసం వస్తుంటారు. కార్యాలయం చుట్టూ వ్యవసాయ పొలాలు ఉన్నాయి. అక్కడి నుంచి విష పురుగులు వస్తున్నాయి. ప్రహరీ పూర్తిస్థాయిలో నిర్మించలేదు. ఇటీవల మూడు నాగుపాములు భవిత సెంటర్ వద్దకు వచ్చినట్లు టీచరు తెలిపారు. ఆ సెంటర్‌లో 12 మంది వికలాంగులు చదువుకుంటున్నారు. పగటిపూట విషసర్పాలు కార్యాలయం చుట్టూ చక్కర్లు కొడుతున్నాయి. దీంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఏదైనా ప్రమాదం జరుగుతుందోమోనని ఆందోళన చెందుతున్నారు. కార్యాలయం వెనుక భాగంలో మరుగుదొడ్లు నిర్మించారు. అవి నిరుపయోగంగా పడి ఉన్నాయి. అధికారులు ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.